# విశాల భారతి

తెలుగు దినపత్రిక

22-05-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 138




## 'బొమ్మల ఇళ్ల' నాటకాలకు చెక్ పెడతాం

- దొరల గడీల భూములను విడిపించి పేదలకే ఇస్తాం
- జూన్ 2న సీఎం రేవంత్ చేతుల మీదుగా రెండో విడత పంపిణీ
- ఇళ్లు కట్టుకునే పేదలకు ఉచితంగా ఇసుక సరఫరా
- రెండేళ్లలో 72,000 కొలువుల భర్తీ; త్వరలో కొత్త నోటిఫికేషన్
- సత్తుపల్లి పరిధిలోని 6,500 ఎకరాలను సర్వే చేసి రైతులకు పట్టాలు
- పాత ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్లులు రెండు రోజుల్లో క్లియర్

02



## సీఎం వ్యాఖ్యలు సిగ్గుచేటు

- రాజీవ్ గాంధీని చూసి మోదీ స్ఫూర్తి పొందాలనడం విడ్డూరం
- 400 మంది ఎంపీలున్నా రాజీవ్ మహిళా బిల్లును ఆమోదించలేదు
- సుప్రీం తీర్పును మార్చి ముస్లిం మహిళల భరణం హక్కును కాలరాశారు
- కాంగ్రెస్ పార్టీ మహిళా బిల్లును ఏడుసార్లు అడ్డుకుంది
- మహిళా సాధికారతపై మోదీకి నీతులు చెప్పే హక్కు కాంగ్రెస్‌కు లేదు
- దశాబ్దాల పాటు మహిళా బిల్లును తొక్కేసిందే కాంగ్రెస్

04

# మైనర్ బాలికతో బీఆర్ఎస్ రాజకీయం

## భగీరథ్ కేసులో కేటీఆర్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు

- నిందితుడిపై చట్టప్రకారమే లీగల్ నోటీసులతో చర్యలు తీసుకున్నాం
- రాష్ట్రంలో 80 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి
- జూన్ 1 నుంచి కోటి మంది కార్మికుల కనీస వేతనాలు పెంపు
- విభాగాన్ని బట్టి కనీస వేతనం రూ. 16,000 నుండి రూ. 20,000 కి పెంపు
- స్కిల్ యూనివర్సిటీ ద్వారా నైపుణ్యాలు నేర్చుకుని విదేశీ ఉద్యోగాలు సాధించాలి

పోక్సో ఆరోపణల సుడిగుండంలో చిక్కుకున్న బండి భగీరథ్ ఉదంతాన్ని అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ నేతలు అత్యంత క్షుద్రమైన, జుగుప్సాకరమైన శాడిస్టు రాజకీయాలకు తెరలేపారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గులాబీ దళపతి కేటీఆర్ తన రాజకీయ ప్రత్యర్థి బండి సంజయ్‌పై ఉన్న వ్యక్తిగత కక్షను తీర్చుకోవడానికి ఏకంగా ఒక మైనర్ బాలిక జీవితాన్ని, ఆత్మగౌరవాన్ని పణంగా పెట్టడం వారి నైతిక దిగజారుడుతనానికి పరాకాష్ట అని నిప్పులు చెరిగారు. చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకుని కేటీఆర్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వంటి నేతలు తామే జడ్జీలుగా అవతారమెత్తి ఇష్టారాజ్యంగా తీర్పులు ఇవ్వడం ప్రజాస్వామ్య వ్యవస్థకే గొడ్డలిపెట్టు అని విమర్శించారు. రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేకనే ఇలాంటి దిగజారుడు ఎత్తుగడలు వేస్తున్నారని, దమ్ముంటే ఎన్నికల బరిలో ప్రజాక్షేత్రంలో ఓడించాలే తప్ప ఇలాంటి చిల్లర వేషాలు వేయకూడదని హితవు పలికారు. సదరు నిందితుడిని పోలీసులు చట్టప్రకారమే అరెస్ట్ చేశారని, ఒకవేళ బండి సంజయ్ స్వయంగా తన కుమారుడిని చట్టానికి అప్పగించి ఉంటే ఆయన ఇంటి వద్దే ఆ ప్రక్రియ పూర్తయ్యేదని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ రాజ్యాంగ నిబంధనల ప్రకారమే నడుచుకుంటుందని, ఎవరిపైనా ఎలాంటి రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

భగీరథ్ ఇష్యూలో బీఆర్ఎస్ శ్రేణులు చేస్తున్న అసత్య ప్రచారాలు వారి దివాళాకోరు రాజకీయాలను బట్టబయలు చేస్తున్నాయని మండిపడ్డారు. కేటీఆర్ ఇప్పటికీ తానేదో 'కల్వకుంట్ల సామ్రాజ్య' రాజ్యాంగంలో బతుకుతున్నట్లు భ్రమపడుతున్నారని, వారు గద్దె దిగి ప్రజలు ఇంటికి పంపించి చాలా రోజులైందనే చేదు నిజాన్ని గ్రహించాలని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. గులాబీ పార్టీ అంతర్గత సమావేశాల కోసం జగిత్యాల వరకు వెళ్లిన గులాబీ బాస్ కేసీఆర్, రాష్ట్రంలో ఇంతటి సంచలన సంఘటన జరిగినా కనీసం స్పందించకపోవడం, నోరు మెదపకపోవడం వెనుక ఉన్న మర్మమేమిటని గట్టిగా నిలదీశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందనడానికి తమ ప్రభుత్వ తీరే నిదర్శనమని, కేటీఆర్ బావమరిది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ దొరికిన వ్యవహారంలోనూ తాము నిబంధనల మేరకే నోటీసులిచ్చి పారదర్శకంగా విచారణ జరిపామని గుర్తుచేశారు. బండి భగీరథ్ విషయంలోనూ అదే తరహాలో లీగల్ నోటీసులు జారీ చేసి పక్కాగా వ్యవహరించామని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో వారి పార్టీ మాజీ ఎమ్మెల్యే ఫామ్‌హౌస్‌లో ఏకంగా పోలీసులపైనే కాల్పులు జరిగిన ఉదంతంలో సదరు నిందితులకు నోటీసులు ఇవ్వని చరిత్ర వారిదని గుర్తుచేశారు. ఆనాడు కనీసం బాధ్యులపై చర్యలు తీసుకోకుండా, పార్టీ నుంచి సస్పెండ్ చేయకుండా కాపాడిన గులాబీ నేతలు, నేడు నీతులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైతుల కష్టాలను కూడా రాజకీయం చేస్తూ శవ రాజకీయాలకు పాల్పడటం వారి సంకుచిత మనస్తత్వానికి అద్దం పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విపక్షాలకు నిజంగానే రైతన్నల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే బురదజల్లడం మానేసి ప్రభుత్వానికి నిర్మాణాత్మకమైన సలహాలు ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటికే ధాన్యం కొనుగోలు ప్రక్రియ అత్యంత వేగంగా ఎనభై శాతం పూర్తయిందని, మిగిలిన ఇరవై శాతాన్ని కూడా త్వరలోనే విజయవంతంగా ముగిస్తామని భరోసా ఇచ్చారు. తెలంగాణ శ్రామిక లోకానికి సరికొత్త ఊరటనిస్తూ కార్మికుల కనీస వేతనాలను భారీగా పెంచుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సగర్వంగా ప్రకటించారు. ప్రభుత్వ పెంచిన ఈ నూతన వేతనాల విప్లవం రాబోయే జూన్ 1, 2026 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా అమలులోకి రానుందని స్పష్టం చేశారు. గత పాలకుల ఘోర నిర్లక్ష్యం, ఉదాసీనత వల్లే దాదాపు కోటి 11 లక్షల మంది శ్రామికులు దశాబ్ద కాలంగా తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అన్యాయాన్ని రూపుమాపడానికే తమ ప్రభుత్వం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సారథ్యంలో ఒక ఉన్నత స్థాయి కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ కమిటీ అన్ని వర్గాలతో

మిగతా 3లో..



## హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ భారీ డేటా సెంటర్

- దేశంలోనే అతిపెద్ద మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్ త్వరలో ప్రారంభం
- రూ.1.45 లక్షల కోట్ల పెట్టుబడిలో ఎక్కువ భాగం ఇక్కడే
- షాద్‌నగర్, మేకగూడ, చందన్‌వెల్లి పరిసరాల్లో పనులు శరవేగం
- భారతీయుల డేటాను ఇక్కడే భద్రపరిచేందుకు ఈ సెంటర్ కీలకం
- మార్కెట్లో అజూర్ క్లౌడ్, కోపైలెట్ సేవలకు విపరీతమైన క్రేజ్
- టీసీఎస్, ఇన్ఫోసిస్ ఇప్పటికే 50 వేల లైసెన్సులు కొన్నాయి

03

# ఒంటరిగా బరిలోకి దిగుతున్నాం..!

అధికారంలోకి రాగానే హామీలన్నీ పక్కాగా అమలు చేస్తాం

- విద్యాదోపిడీని ఆపడానికి 30 రోజుల్లోగా ఫీజు నియంత్రణ తేవాలి
- జూన్ 2 లోగా అమరవీరుల కుటుంబాల వాగ్దానాలు నెరవేర్చాలి
- కుత్బుల్లాపూర్ అమరుల స్థూపాన్ని ప్రభుత్వం ఆవిష్కరించకుంటే తామే చేస్తాం
- రాబోయే అసెంబ్లీ, 150 జీహెచ్ఎంసీ డివిజన్లలో ఒంటరిగా పోటీ
- స్థానిక పరిశ్రమల్లో యువతకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం ఫెయిల్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వచ్చిన వెంటనే తాము ప్రజలకు ఇచ్చిన పాంచజన్యం హామీలను సంపూర్ణంగా అమలు చేస్తామని ఆ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో నిర్వహించిన జెండా పండుగ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తెలంగాణ రక్షణ సేనలో చేరారు. పార్టీలోకి వచ్చిన వారికి గులాబీ కండువాలు కప్పి ఆమె సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలపై, నిరుద్యోగ, విద్యార్థి సమస్యలపై ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.రాష్ట్రంలో విద్యా వ్యవస్థ వ్యాపారంగా మారిపోయిందని, ప్రైవేటు విద్యా సంస్థల దోపిడీకి అడ్డుకట్ట వేయాల్సిన

మిగతా 3లో..

## నియోజకవర్గాల ఇంచార్జీలను ప్రకటించిన కేసీఆర్

- 119 నియోజకవర్గాలకు డిజిటల్ సభ్యత్వ నమోదు ఇంచార్జీల నియామకం
- తెలంగాణ భవన్‌లో ఇంచార్జీలు, ఐటీ నిపుణులకు యాప్‌పై శిక్షణ
- జిల్లా కేంద్రాల్లో బూత్‌కు ఇద్దరి చొప్పున వారం పాటు శిబిరాలు
- ట్రైనింగ్ పూర్తి కాగానే స్వయంగా కేసీఆర్ చేతులమీదుగా నమోదు షురూ
- సభ్యత్వాలు ముగియగానే గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి కమిటీల ఎన్నికలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 10 సీట్లకు ఇంచార్జీలు ఖరారు



02



## హైదర్‌నగర్‌లో కలుషిత నీరు

- జలమండలి నిర్లక్ష్యంపై 'విశాల భారతి' కథనం ఎండీ సీరియస్
- లైన్‌మెన్ నుంచి జీఎం వరకు వార్నింగ్, దిద్దుబాటు చర్యలకు ఆదేశం

03


DISTRICT news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి
హైదర్ నగర్‌లో కలుషిత నీరు, జలమండలి నిర్లక్ష్యం బట్టబయలు
పాలకులకు, అధికారులకు పట్టదా? .. ప్రశ్నిస్తున్న ప్రజా సంఘాలు
45 నిమిషాల నీళ్లు కూడా భారమా?

## ట్రిపుల్ ఆర్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం సివిల్ పనులకు గ్లోబల్ టెండర్లు జారీ
- 6 వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం రూ.9,362 కోట్ల కేటాయింపు




02

# కళ్లు తెరవండి.. ధాన్యం కొనండి



పంట కొనుగోళ్ల సంక్షోభం పై ఎన్నాళ్లీ మొద్దు నిద్ర

- రైతుల ప్రాణాలు పోతున్నా.. పంటలు కొనరా?
- కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతలు కుప్పకూలుతున్నా కనికరించరా?
- ధాన్యం తగలబెట్టుకుంటున్నా తండ్లాట తీర్చరా?
- రోడ్డెక్కని రైతు లేదు.. రాస్తారోకో జరగని రహదారి లేదు
- కాంటా పెట్టని కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది
- సీఎం రేవంత్‌కు రాసిన లేఖలో నిప్పులు చెరిగిన కేటీఆర్

03

# ట్రిపుల్ ఆర్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం సివిల్ పనులకు గ్లోబల్ టెండర్లు జారీ
- 6 వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం రూ.9,362 కోట్ల కేటాయింపు
- పనుల వేగం కోసం ప్రాజెక్టును 2 ప్యాకేజీలుగా మార్చారు
- జూలై 7 లోపు బిడ్లు వేయాలి; 2029 నాటికి పూర్తి కావాలి
- ఈ రూట్‌లో 44 పెద్ద వంతెనలు, 9 టోల్‌ప్లాజాలు వస్తాయి
- 1,814 హెక్టార్ల భూసేకరణ ప్రక్రియ దాదాపు క్లియర్ అయింది




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్ర రవాణా రంగాన్ని సరికొత్త ఆర్థిక కారిడార్‌గా మార్చేందుకు ఉద్దేశించిన రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్టు ఎట్టకేలకు క్షేత్రస్థాయి పరిశోధనలు ముగించుకుని నిర్మాణ దశకు చేరుకుంది. తెలంగాణ రాజధాని చుట్టూ మకుటంలా మారనున్న ఈ భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులో అత్యంత కీలకమైన ఉత్తర భాగం పనులకు కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. గత రెండేళ్లుగా వివిధ రకాల అనుమతులు, నిధుల సర్దుబాటు, భూసేకరణ సమస్యల కారణంగా ఆలస్యమవుతూ వచ్చిన ఈ ప్రాజెక్టు ప్రక్రియకు ఇప్పుడు లైన్ క్లియర్ అయింది. గతంలో పరిపాలనా సౌలభ్యం కోసం అనుకున్న ఐదు ప్యాకేజీల సుదీర్ఘ విధానాన్ని రద్దు చేస్తూ, పనుల వేగాన్ని గణనీయంగా పెంచే లక్ష్యంతో కేవలం రెండు ప్యాకేజీలకే పరిమితం చేస్తూ సరికొత్త వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఈ పనులకు సంబంధించి నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారికంగా గ్లోబల్ టెండర్ నోటిఫికేషన్‌ను జారీ చేయడంతో ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. ఈ భారీ ప్రాజెక్టు మొదటి విడత నిర్మాణంలో భాగంగా సంగారెడ్డి జిల్లా గిర్మాపూర్ గ్రామం నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా తంగడపల్లి వరకు మొత్తం 161.518 కిలోమీటర్ల మేర సరికొత్త రహదారిని నిర్మించనున్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రమాణాలకు లోబడి, పాత రోడ్లతో సంబంధం లేకుండా పూర్తిగా నూతన భూముల్లో నిర్మించే ఆరు వరుసల గ్రీన్‌ఫీల్డ్ రీజినల్ ఎక్స్‌ప్రెస్‌వేగా దీనిని అద్భుతంగా తీర్చిదిద్దనున్నారు. ఈ నార్తర్న్ కారిడార్ పరిధిలోని కేవలం సివిల్ నిర్మాణ పనుల కోసమే కేంద్ర ప్రభుత్వం తొమ్మిది వేల మూడు వందల అరవై రెండు కోట్ల నలభై లక్షల రూపాయల భారీ బడ్జెట్‌ను కేటాయించడం ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది. భవిష్యత్తులో హైదరాబాద్ మహానగర పరిధిని దాటి జిల్లాల సరిహద్దుల్లో భారీ పారిశ్రామిక హబ్‌లు ఏర్పడటానికి ఈ రహదారి ఒక ప్రధాన ఉత్ప్రేరకంగా మారుతుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. పనుల విభజనను పరిశీలిస్తే మొదటి ప్యాకేజీ పరిధిలో 83.518 కిలోమీటర్ల మేర అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో నిర్మాణాలు సాగుతాయి. సంగారెడ్డి జిల్లా గిర్మాపూర్ వద్ద ప్రారంభమయ్యే ఈ రహదారి మెదక్ జిల్లా సరిహద్దులను తాకుతూ సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ వరకు కొనసాగుతుంది. ఈ తొలి విడత సివిల్ పనుల అంచనా వ్యయాన్ని నాలుగు వేల తొమ్మిది వందల పద్దెనిమిది కోట్ల డెబ్బై ఒక్క లక్షల రూపాయలుగా ఖరారు చేశారు. ఈ మార్గం ఐటీ హబ్ వైపు వెళ్లే పారిశ్రామిక రవాణాను, ఉత్తర తెలంగాణ జిల్లాల సరుకు రవాణాను సులభతరం చేస్తుంది. జాతీయ రహదారి 65తో పాటు రాజీవ్ రహదారిని అనుసంధానించడంలో ఈ విభాగం భవిష్యత్తులో అత్యంత కీలక పాత్ర పోషించనుంది. రెండో ప్యాకేజీ కింద మిగిలిన 78 కిలోమీటర్ల మేర పనులను సమాంతరంగా పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా తంగడపల్లి వరకు ఈ అంతర్జాతీయ స్థాయి రహదారి నిర్మాణం సాగుతుంది. ఈ రెండో విడత పనుల కోసం నాలుగు వేల నాలుగు వందల నలభై మూడు కోట్ల అరవై తొమ్మిది లక్షల రూపాయల వ్యయాన్ని అంచనా వేశారు. ఆధ్యాత్మిక క్షేత్రమైన యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లే భక్తులకు, వరంగల్ వైపు ప్రయాణించే వాహనదారులకు చుట్టుపక్కల జిల్లాల ప్రజలకు ఈ మార్గం ట్రాఫిక్ రహిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించనుంది. ప్రస్తుత టెండర్ల ప్రక్రియకు సంబంధించి జాతీయ రహదారుల సంస్థ విడివిడిగా అంతర్జాతీయ బిడ్‌లను ఆహ్వానించింది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మౌలిక వసతుల నిర్మాణ సంస్థలు జూలై ఏడో తేదీ ఉదయం పదకొండు గంటల వరకు తమ బిడ్‌లను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా సమర్పించేందుకు గడువు విధించారు. ఆ మరుసటి రోజే అంటే జూలై ఎనిమిదో తేదీన సాంకేతిక బిడ్‌ల పరిశీలన ప్రక్రియను ఉన్నతాధికారుల కమిటీ చేపడుతుంది. డిజైన్, బిల్ట్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ ఆర్థిక నమూనా ప్రాతిపదికన ఈ పనులను ప్రైవేట్ భాగస్వామ్యంతో అప్పగించనున్నారు. ఈ మెగా ప్రాజెక్టు కాలపరిమితిని ఎన్‌హెచ్ఏఐ నిబంధనలలో అత్యంత కఠినంగా పేర్కొంది. టెండర్లు ఖరారై నిర్మాణ సంస్థకు లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ అందిన నాటి నుంచి సరిగ్గా మూడేళ్ల వ్యవధిలో అన్ని పనులు పూర్తి కావాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో ఎటువంటి భూసేకరణ అడ్డంకులు, కోర్టు వివాదాలు, పరిపాలనాపరమైన జాప్యం ఎదురుకాకపోతే రెండు వేల ఇరవై తొమ్మిది నాటికి ఉత్తర భాగం పూర్తిగా ప్రజలకు అందుబాటులోకి వస్తుంది. నగర శివార్లలో రోజురోజుకు పెరుగుతున్న భారీ వాహనాల ట్రాఫిక్ ఇబ్బందులను శాశ్వతంగా తొలగించడంలో ఈ రహదారి ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలవనుంది. హైవేపై ప్రయాణ వేగాన్ని పెంచేలా అంతర్జాతీయ సివిల్ ఇంజనీరింగ్ డిజైన్‌తో ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేను రూపొందిస్తున్నారు. గంటకు నూట ఇరవై కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించే వాహనాలకు సైతం ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రహదారి మలుపులను, వంపులను క్రమబద్ధీకరిస్తున్నారు. సుదూర ప్రాంతాల మధ్య ప్రయాణ సమయాన్ని దాదాపు మూడు నుంచి నాలుగు గంటల మేర తగ్గించడమే పరమావధిగా నిపుణులు ఈ ప్రణాళికను సిద్ధం చేశారు. భవిష్యత్తులో యాభై ఏళ్ల రవాణా అవసరాలను, వాహనాల పెరుగుదల రేటును ముందే అంచనా వేసి ఈ భారీ రహదారి వెడల్పును ఖరారు చేశారు. ఈ సుదీర్ఘ మార్గంలో ప్రయాణం ఎక్కడా ఆగకుండా సాఫీగా సాగేందుకు భారీ ఎత్తున మౌలిక నిర్మాణాలను చేపడుతున్నారు. ఇందులో భాగంగా నలభై నాలుగు పెద్ద వంతెనలు, నూట ఇరవై ఏడు చిన్న వంతెనలను నిర్మించనున్నారు. రైల్వే లైన్లను దాటేందుకు వీలుగా నాలుగు అత్యాధునిక రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, స్థానిక గ్రామాల వాహనాల కోసం నలభై నాలుగు అండర్‌పాసులు, వెయ్యి రెండు వందల అరవై రెండు కల్వర్టులు రానున్నాయి. వీటితో పాటు నిరంతరాయ ప్రయాణాన్ని పర్యవేక్షించేందుకు, డిజిటల్ చెల్లింపుల కోసం తొమ్మిది చోట్ల అధునాతన టోల్‌ప్లాజాలను ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణలోని తొమ్మిది ముఖ్య ప్రాంతాలలో వివిధ జాతీయ, రాష్ట్ర రహదారులతో ఈ రీజినల్ రింగు రోడ్డు అనుసంధానం కావడం విశేషం. సుదీర్ఘ ప్రయాణం చేసే వాహనదారుల సౌకర్యార్థం ఆరు ప్రత్యేక వ్యూహాత్మక ప్రాంతాలలో అంతర్జాతీయ స్థాయి విశ్రాంతి గదులను, వినోద కేంద్రాలను నిర్మిస్తున్నారు. ఈ భారీ రహదారి నిర్మాణానికి గాను సుమారు ఒక వెయ్యి ఎనిమిది వందల పద్నాలుగు హెక్టార్ల భూసేకరణ ప్రక్రియను ఇప్పటికే రెవెన్యూ అధికారులు దాదాపుగా పూర్తి చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే తెలంగాణ జిల్లాల గ్రామీణ ఆర్థికవ్యవస్థ సరికొత్త పుంతలు తొక్కుతుందని రియల్ ఎస్టేట్, పారిశ్రామిక వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## యువతకు రాజకీయ ప్రత్యామ్నాయంగా టీఆర్ఎస్



**ఆదిలాబాద్, విశాలభారతి:** కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఏర్పాటైన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ యువత ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తుందని రాష్ట్ర టీఆర్ఎస్ పర్యవేక్షణ నాయకుడు, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. గురువారం నేరడిగొండ మండలంలో నిర్వహించిన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం ఎన్నో ఉద్యమాలు జరిగినప్పటికీ, యువతకు తగిన అవకాశాలు ఇంకా అందలేదని పేర్కొన్నారు. నిరుద్యోగం, వివిధ సామాజిక సమస్యలతో యువత నిరంతరం పోరాడుతోందని అన్నారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్, ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలతో సామాన్య ప్రజలకు, యువతకు పెద్దగా ప్రయోజనం చేకూరలేదని విమర్శించారు. రానున్న రోజుల్లో కల్వకుంట్ల కవిత నాయకత్వంలో టీఆర్ఎస్ రాష్ట్రంలో బలమైన రాజకీయ శక్తిగా ఎదిగి, అత్యధిక మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా యువత పెద్ద ఎత్తున పార్టీ సభ్యత్వాలు స్వీకరిస్తోందని, బోథ్ నియోజకవర్గంలో కూడా టీఆర్ఎస్ జెండాను ఎగరవేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. మేధావులు, ప్రజాస్వామ్యవాదులు పార్టీకి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకుడు వసంతరావు, నియోజకవర్గ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## హిందూ దేవాలయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**వడ్డేపల్లి రాజేశ్వరరావు బిజెపి రాష్ట్ర కార్యదర్శి**



**కూకట్ పల్లి విశాలభారతి:** కేపీహెచ్‌బీ ఫేజ్ 3 లోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరై ఆలయాన్ని సందర్శించి శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావును ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. హిందూ దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనగాం సురేష్ రెడ్డి, జయచంద్ర రెడ్డి, రఘురాం, శివశంకర్, రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'బొమ్మల ఇళ్ల' నాటకాలకు చెక్ పెడతాం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



దొరల గడీలలో దశాబ్దాలుగా బందీ అయిన భూములను విడిపించి, వాటిపై పేద ప్రజలకే సర్వాధికారాలు కల్పిస్తామని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, ధరణి పోర్టల్‌లో నెలకొన్న సాంకేతిక లోపాల వల్ల రాష్ట్రంలోని పేదలు, రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని ఎంఆర్ గార్డెన్స్‌లో స్థానిక శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి మండలాలకు సంబంధించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రజా దర్బార్' సదస్సు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి, వందలాదిగా తరలివచ్చిన ప్రజల నుంచి స్వయంగా వినతిపత్రాలను స్వీకరించి, గత ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రస్తావిస్తూ, గత పాలకులు ధనిక రాష్ట్రాన్ని రూ. 8,18,000 కోట్ల అప్పుల కుప్పగా మార్చారని మంత్రి పొంగులేటి తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వంపై భారీగా అప్పులు ఉన్నాయనే నెపంతో తాము చేతులు ముడుచుకుని కూర్చోలేదని, అందుబాటులో ఉన్న వనరులతోనే పేదవాడికి పూర్తి భద్రత, భరోసా కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. గత పాలకుల కాలంలో ఎన్నికలు రాగానే ఇందిరమ్మ ఇళ్ల పేరుతో బొమ్మలు చూపించి ఒట్టి కాగితాలకే పరిమితం చేశారని మండిపడ్డారు. కానీ, తమ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రూ. 22,500 కోట్లతో ఏకంగా 4,50000 ఇళ్లు మంజూరు చేసి రికార్డు సృష్టించిందని వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 1,25,000 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా, రాబోయే జూన్ నాటికి మరో 1,00,000 ఇళ్లు పంపిణీకి సిద్ధమవుతాయని తెలిపారు. వచ్చే జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీని అత్యంత ఘనంగా ప్రారంభిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. పాలనలో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, హైదరాబాద్‌లో బటన్ నొక్కితే ఒక్క రూపాయి లంచం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే ప్రతి సోమవారం నిధులు జమ చేస్తున్నట్లు వివరించారు. సొంత స్థలం ఉండి ఇళ్లు కట్టుకునే పేదలకు మరింత ఊరటనిస్తూ, ములకలపల్లి క్వారీ నుంచి ఎలాంటి రుసుము లేకుండా నాణ్యమైన ఇసుకను ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారు. నిరుద్యోగ రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యతను వివరిస్తూ, గత పాలకుల హయాంలో నిరుద్యోగులను రోడ్డున పడేస్తే, తమ ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్ల స్వల్ప వ్యవధిలోనే 72,000 ప్రభుత్వ ఉద్యోగాలను విజయవంతంగా భర్తీ చేసిందని, త్వరలోనే మరో కొత్త కొలువుల ప్రకటన (నోటిఫికేషన్) రాబోతుందని నిరుద్యోగులకు భరోసా ఇచ్చారు. సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని దీర్ఘకాలిక భూ సమస్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సుదీర్ఘంగా సమీక్షించి, సానుకూల నిర్ణయాలు ప్రకటించారు. ముఖ్యంగా సత్తుపల్లి పట్టణ పరిధిలోని 399 సర్వే నంబర్ వివాదాస్పద అంశంతో పాటు, చుట్టుపక్కల గల 9 గ్రామాల్లో ఉన్న దాదాపు 6,500 ఎకరాల భూ సమస్యలపై మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించారు. పేదపల్లి, నారాయణపురం పరిసర ప్రాంతాల్లోని 5,500 ఎకరాల పైచిలుకు భూములను క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో శాస్త్రీయ పద్ధతుల్లో కొలతలు (సర్వే) చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం సదరు భూములపై వాస్తవ స్వాధీనంలో ఉన్న అర్హులైన పేద రైతులందరికీ పూర్తి హక్కులతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని, తక్షణమే పహానీలలో వారి పేర్లను తప్పుల్లేకుండా నమోదు చేయాలని రెవెన్యూ యంత్రాంగానికి కఠిన ఆదేశాలు జారీ చేశారు. ఈ భూ రికార్డుల ప్రక్షాళన ప్రక్రియ అత్యంత వేగంగా, పారదర్శకంగా పూర్తి కావడానికి రైతులు, స్థానిక ప్రజలు రెవెన్యూ అధికారులకు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో సహకరించాలని మంత్రి కోరారు. గత ప్రభుత్వ హయాం నుంచి పెండింగ్‌లో ఉన్న పాత ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన నిధుల బకాయిలు, ఇతర నిర్మాణాల పెండింగ్ బిల్లులను తక్షణమే క్లియర్ చేయాలని ఆర్థిక శాఖకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని వివరించారు. ఈ బిల్లుల చెల్లింపులకు సంబంధించిన సానుకూల ఫలితాలు మరికొద్ది రోజుల్లోనే క్షేత్రస్థాయిలో కనిపిస్తాయని, ఏ ఒక్క పేదవాడి సొమ్ము వృథా కాకుండా ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి సత్తుపల్లి ప్రజా దర్బార్ సభ ముఖంగా హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరా భూమికి రక్షణ కల్పించడమే కాకుండా, ధరణి పోర్టల్ ద్వారా నష్టపోయిన లక్షలాది మంది చిన్న, సన్నకారు రైతులకు న్యాయం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ మంత్రి స్పష్టం చేశారు. భూసంబంధిత వివాదాల పరిష్కారం కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో భూయజమానులు తమ హక్కుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే దుస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు అధికారులే నేరుగా గ్రామాల వద్దకు వచ్చి సమస్యలను పరిష్కరించేలా 'ప్రజా పాలన' వేదికలను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఈ నూతన విధానం ద్వారా దళారీ వ్యవస్థకు పూర్తిగా అడ్డుకట్ట పడుతుందని, నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వ ఫలాలు నేరుగా అందుతాయని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా పరిధిలోని పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి మండలాల్లో సాగునీటి, తాగునీటి ప్రాజెక్టుల పురోగతిని కూడా ఈ సందర్భంగా మంత్రి సమీక్షించారు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ సరఫరాను నిరంతరాయంగా అందిస్తున్నామని, ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులు పండించిన ప్రతి గింజనూ మద్దతు ధరకే కొనుగోలు చేసేందుకు వీలుగా గ్రామాల్లో తగినన్ని కొనుగోలు కేంద్రాలను సకాలంలో ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయదారులపై కఠినంగా వ్యవహరిస్తామని, రైతులను మోసం చేసే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధికి గాను స్థానిక శాసనసభ్యులతో కలిసి ప్రత్యేక నిధుల మంజూరుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలో రవాణా వసతుల మెరుగుదలకు, గ్రామీణ రోడ్ల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలను మెరుగుపరచడంతో పాటు, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు వీలుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నట్లు వివరించారు. ప్రజా పాలన అనేది కేవలం ఒక కార్యక్రమం కాదని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని ప్రజలకు స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, తన నియోజకవర్గ పరిధిలోని నిరుపేదల భూ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగానే సానుకూలంగా స్పందించి, తక్షణ సర్వేకు ఆదేశాలు ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. గత పదేళ్ల కాలంలో సత్తుపల్లి ప్రాంతంలో అనేక భూములు వివాదాల్లో చిక్కుకున్నాయని, వాటిని పరిష్కరించేందుకు ఈ ప్రజా దర్బార్ ఎంతో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు రాబడతామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## నియోజకవర్గాల ఇంచార్జీలను ప్రకటించిన కేసీఆర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాష్ట్రంలో సరికొత్త రాజకీయ వ్యూహాలతో ముందడుగు వేస్తున్న భారత్ రాష్ట్ర సమితి క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను బలోపేతం చేసేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న డిజిటల్ సభ్యత్వ నమోదు ప్రక్రియ కోసం గులాబీ అధినేత కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రత్యేకంగా ఇన్‌చార్జీలను నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఈసారి డిజిటల్ పద్ధతిలో అత్యంత పారదర్శకంగా సభ్యత్వాల స్వీకరణ చేపట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో, ప్రతి నియోజకవర్గానికి ఒక రాజకీయ ఇన్‌చార్జితో పాటు ఒక ఐటీ నిపుణుడిని కూడా కేటాయించడం విశేషం. పార్టీ శ్రేణులందరినీ డిజిటల్ విప్లవం వైపు నడిపించేందుకు అవసరమైన పూర్తిస్థాయి కార్యాచరణను పార్టీ ప్రధాన కార్యాలయం సిద్ధం చేసింది. ఈ బృహత్తర ప్రక్రియను విజయవంతం చేసేందుకు గాను హైదరాబాద్ నగరంలోని తెలంగాణ భవన్‌లో విస్తృత స్థాయి డిజిటల్ శిక్షణా తరగతులను త్వరలోనే ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల నుంచి వచ్చే ఇన్‌చార్జీలు, ఐటీ నిపుణులకు ఈ వేదికపై సాంకేతిక అంశాలపై పూర్తి అవగాహన కల్పిస్తారు. ఇప్పటికే సభ్యత్వ నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు రూపొందించిన ప్రత్యేక డిజిటల్ మొబైల్ అప్లికేషన్ తుది మెరుగులు దిద్దుకుంటోంది. అత్యంత సురక్షితమైన డేటా బేస్, వేగవంతమైన నమోదు ప్రక్రియతో కూడిన ఈ సరికొత్త యాప్ వచ్చే కొన్ని రోజుల్లోనే శ్రేణులకు అందుబాటులోకి రానుంది. ఈ యాప్ ద్వారా నమోదు చేసుకున్న వెంటనే సభ్యులకు డిజిటల్ గుర్తింపు కార్డులు జారీ చేసేలా సాంకేతిక నిపుణులు దీనిని తీర్చిదిద్దారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి శిక్షణా కార్యక్రమం ముగిసిన వెంటనే, ఈ ఇన్‌చార్జీల బృందాలు క్షేత్రస్థాయికి పయనం కానున్నాయి. ఆయా జిల్లాల్లో ఇప్పటికే క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్చార్జీల సమన్వయంతో జిల్లా కేంద్రాల్లోని బీఆర్ఎస్ కార్యాలయాల్లో ద్వితీయ శ్రేణి శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేస్తారు. నియోజకవర్గాల వారీగా సాగే ఈ శిక్షణలో స్థానిక నాయకులకు, డిజిటల్ నమోదు ప్రక్రియలో పాల్గొనే వాలంటీర్లకు పూర్తి స్థాయిలో యాప్ నిర్వహణపై శిక్షణ ఇస్తారు. పార్టీ అంతర్గత వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ జిల్లా స్థాయి శిబిరాలు అత్యంత కీలకమైన మైలురాయిగా నిలవనున్నాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రణాళికను మరింత లోతుగా గ్రామీణ స్థాయికి తీసుకెళ్లేందుకు బూత్ స్థాయి కమిటీలను రంగంలోకి దించుతున్నారు. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో అందుబాటులో ఉన్న మొత్తం పోలింగ్ బూత్‌ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని, ప్రతి ఒక్క బూత్‌కు ఇద్దరు చొప్పున క్రియాశీలక కార్యకర్తలను ఎంపిక చేస్తారు. నిర్ణయించిన తేదీల ప్రకారం వరుసగా వారం రోజుల పాటు ఈ శిక్షణా శిబిరాలు నిరంతరాయంగా కొనసాగుతాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శిక్షణా ప్రాంగణాల వద్దే రుచికరమైన భోజన వసతి సదుపాయాలను పార్టీ పరంగా కల్పిస్తున్నారు. ఈ శిక్షణ ద్వారా సుమారు వేలాది మంది బూత్ స్థాయి డిజిటల్ సైనికులు క్షేత్రస్థాయిలో సభ్యత్వాలను సేకరించేందుకు సర్వసన్నద్ధం కానున్నారు. ఈ మొత్తం వ్యవహారాల పర్యవేక్షణ బాధ్యతలను రాష్ట్ర కమిటీ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తుంది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌చార్జుల సమక్షంలో రోజువారీ పురోగతిని సమీక్షిస్తూ జిల్లాల వారీగా నివేదికలు సేకరిస్తారు. ఎక్కడైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే వాటిని తక్షణమే పరిష్కరించేందుకు వీలుగా రాష్ట్ర కార్యాలయంలో ఒక ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ సమగ్ర డిజిటల్ శిక్షణ ప్రక్రియ విజయవంతంగా ముగిసిన మరుసటి క్షణమే అధికారికంగా సభ్యత్వ నమోదు ప్రారంభ తేదీని అధిష్ఠానం ప్రకటిస్తుంది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఒక ఉత్సవంలా నిర్వహించేందుకు గులాబీ శ్రేణులు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. సభ్యత్వ నమోదు ప్రారంభమయ్యే శుభ ముహూర్తాన స్వయంగా పార్టీ అధినేత కేసీఆర్ తో సహా పార్టీకి చెందిన రాష్ట్ర స్థాయి ముఖ్య నేతలంతా ఒకేసారి తమ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోనున్నారు. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో, సరికొత్త ఉత్సాహంతో ఈ నమోదు ప్రక్రియ ఊపందుకోనుంది. ఇదే సమయంలో గ్రామ స్థాయి నుంచి మొదలుకొని మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు ఉండే అన్ని రకాల అనుబంధ కమిటీల పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన ఎన్నికల షెడ్యూలును కూడా అధికారికంగా ప్రకటిస్తారు. నిర్ణీత కాలపరిమితిలోగా అన్ని కమిటీల నియామకాలను పూర్తి చేసి, కొత్తగా ఎన్నికైన పదాధికారులకు సైతం ప్రత్యేక రాజకీయ శిక్షణా శిబిరాలను నిర్వహించాలని పార్టీ యోచిస్తోంది. పనివిభజనలో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన కీలకమైన 10 అసెంబ్లీ నియోజకవర్గాలకు నిపుణులైన ఇన్‌చార్జీలను అధినేత ప్రకటించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం, క్షేత్రస్థాయి పరిస్థితులపై పూర్తి అవగాహన ఉన్న నాయకులకు ఈ బాధ్యతలను అప్పగించారు. ఈ జిల్లాలోని భౌగోళిక, సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని ఆదిలాబాద్ రూరల్, అర్బన్ పరిధులతో పాటు ఏజెన్సీ ప్రాంతాలలో కూడా సభ్యత్వ నమోదు అత్యంత వేగంగా సాగేలా వ్యూహాలు రచించారు. ప్రతి నియోజకవర్గంలోనూ కనీసం లక్షకు పైగా సభ్యత్వాలను డిజిటల్ రూపంలో నమోదు చేయించడమే లక్ష్యంగా ఇక్కడి ఇన్‌చార్జీలు పని చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా సిర్పూర్ నియోజకవర్గ డిజిటల్ సభ్యత్వ నమోదు బాధ్యతలను శ్రీ పాటిమీది జగన్ మోహన్ రావుకు అప్పగించారు. అలాగే చెన్నూర్ (ఎస్సీ) నియోజకవర్గానికి శ్రీ తిప్పని లింగన్నను, బెల్లంపల్లి (ఎస్సీ) స్థానానికి శ్రీ మిర్యాల రాజిరెడ్డిని ఇన్‌చార్జీలుగా నియమించారు. పారిశ్రామికంగా, కార్మిక రంగానికి పట్టుకొమ్మగా ఉన్న మంచిర్యాల నియోజకవర్గ బాధ్యతలను శ్రీ కౌశిక హరికి అప్పగించగా, గిరిజన ప్రాంతమైన ఆసిఫాబాద్ (ఎస్టీ) నియోజకవర్గ బాధ్యతలను శ్రీ తొంగల సత్యనారాయణకు కేటాయించారు. ఈ నేతలంతా తమతమ నియోజకవర్గాల్లో స్థానిక నాయకత్వంతో కలిసి సమన్వయ సమావేశాలు నిర్వహించేందుకు ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించారు. అదేవిధంగా ఖానాపూర్ (ఎస్టీ) నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిగా శ్రీమతి సుమిత్ర ఆనంద్ తనోబా నియామకం కాగా, జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్ నియోజకవర్గ బాధ్యతలను రాథోడ్ జనార్దన్ చూసుకోనున్నారు. గిరిజన ప్రాధాన్యత కలిగిన బోథ్ (ఎస్టీ) నియోజకవర్గానికి శ్రీ ఎ. శ్రీకాంత్ రెడ్డిని, పారిశ్రామిక, వ్యాపార కేంద్రంగా ఉన్న నిర్మల్ నియోజకవర్గానికి శ్రీ మూల రాజిరెడ్డిని నియమించారు. మహారాష్ట్ర సరిహద్దులకు ఆనుకుని ఉండే ముధోల్ నియోజకవర్గ బాధ్యతలను శ్రీ రఘువీర్ సింగ్‌కు అప్పగిస్తూ పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఈ నియామకాల ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో సరికొత్త జోష్ నెలకొంది. నియమితులైన ఇన్‌చార్జీలంతా తక్షణమే తమకు కేటాయించిన నియోజకవర్గాల్లో పర్యటించి, స్థానిక బూత్ స్థాయి కమిటీల వివరాలను సేకరిస్తున్నారు. డిజిటల్ యాప్ ద్వారా సభ్యత్వాల నమోదు ఎలా చేయాలో వివరించేందుకు ప్రతి పల్లెలోనూ ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నారు. డిజిటల్ పరిజ్ఞానంపై అవగాహన తక్కువగా ఉన్న గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా సులభంగా అర్థమయ్యేలా ప్రత్యేక పోస్టర్లు, కరపత్రాల ద్వారా అవగాహన కల్పించనున్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ పార్టీని అత్యంత బలిష్టమైన శక్తిగా తీర్చిదిద్దేందుకు ఈ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఒక బలమైన పునాదిగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ భారీ డేటా సెంటర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ మహానగరం అంతర్జాతీయ సాంకేతిక ముఖచిత్రంపై సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతోంది. ప్రపంచ ఐటీ రంగంలో మేటి సంస్థగా వెలుగొందుతున్న మైక్రోసాఫ్ట్, తన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన, భారీ డేటా సెంటర్ ప్రాజెక్టును ఇక్కడ తుది దశకు చేర్చింది. రానున్న కొన్ని నెలల్లోనే ఈ సముదాయాన్ని వినియోగదారులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. దక్షిణ భారత దేశపు ఐటీ హబ్‌గా విరాజిల్లుతున్న భాగ్యనగరంలో ఈ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నట్లు మైక్రోసాఫ్ట్ ఇండియా, దక్షిణాసియా అధ్యక్షుడు పునీత్ చందోక్ తాజాగా ఒక ప్రత్యేక వేదికపై వెల్లడించారు. దేశీయంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్ సేవలకు మార్కెట్లో అపరిమితమైన డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టును రికార్డు సమయంలో పూర్తి చేయడానికి సంస్థ అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. ప్రస్తుతం దేశీయ ఐటీ విపణిలో మైక్రోసాఫ్ట్ అందిస్తున్న అజూర్ క్లౌడ్ సర్వీసెస్, కోపైలెట్ 365 ఏఐ అసిస్టెంట్లకు వినియోగదారుల నుంచి విపరీతమైన ఆదరణ లభిస్తోంది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న సాంకేతిక మార్కెట్లలో భారతదేశం అగ్రగామిగా దూసుకుపోతోంది. ఇక్కడ 100 కోట్ల మందికి పైగా ఇంటర్నెట్ వినియోగదారులు ఉండటం, సాంకేతిక నైపుణ్యాలు కలిగిన నిపుణులు భారీ సంఖ్యలో లభ్యమవ్వడం అంతర్జాతీయ సంస్థలను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ సానుకూల అంశాలను పరిగణనలోకి తీసుకుని గతేడాది ఆఖర్లో మైక్రోసాఫ్ట్ సంస్థ రూ.1.45 లక్షల కోట్ల భారీ పెట్టుబడి ప్రణాళికను ప్రకటించింది. ఈ వ్యూహాత్మక నిధుల్లో సింహభాగాన్ని హైదరాబాద్ వేదికగా నిర్మిస్తున్న డేటా సెంటర్ల విస్తరణకే కేటాయించడం గమనార్హం. ఇప్పటికే ఈ సంస్థకు దేశంలోని పుణె, చెన్నై, ముంబయి నగరాల్లో డేటా సెంటర్లు ఉన్నప్పటికీ, హైదరాబాద్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ సముదాయం వాటన్నింటికన్నా అత్యంత భారీ పరిమాణంలో నిలవనుంది. భారతదేశంలో ఇటీవల అమల్లోకి వచ్చిన డిజిటల్ వ్యక్తిగత డేటా రక్షణ చట్టం నిబంధనల ప్రకారం స్థానిక వినియోగదారుల సమాచారాన్ని ఇక్కడి సర్వర్లలోనే భద్రపరచడం చట్టబద్ధంగా అనివార్యమైంది. ఈ నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌లో అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటు చేస్తున్న ఈ డేటా సెంటర్ సరికొత్త ప్రభుత్వ నిబంధనల అమలుకు ఎంతో కీలకంగా మారనుంది. గూగుల్, అమెజాన్ వంటి ఇతర అంతర్జాతీయ డిజిటల్ దిగ్గజ సంస్థల నుంచి మార్కెట్లో గట్టి పోటీ ఎదురవుతున్నప్పటికీ, మౌలిక వసతుల కల్పనలో తాము అందరికంటే ఎంతో ముందున్నామని పునీత్ చందోక్ పూర్తి ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్ అవసరాలను ముందే ఊహించి అత్యాధునిక సాంకేతికతతో ఈ కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు వివరించారు. మైక్రోసాఫ్ట్ అంతర్జాతీయంగా విడుదల చేస్తున్న పలు కీలకమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫీచర్ల రూపకల్పనలో దేశీయ ఇంజినీర్ల పాత్ర ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం భారతదేశవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ సంస్థలో 22,000 మందికి పైగా ఉద్యోగులు విధుల్లో కొనసాగుతున్నారు. సాంకేతిక మార్కెట్లో ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణులకు డిమాండ్ ఊహించని స్థాయిలో పెరిగింది. ఈ తరుణంలో సరైన ప్రతిభావంతులను, నైపుణ్యం ఉన్న ఉద్యోగులను ఎంచుకోవడం మొత్తం ఐటీ రంగానికి ఒక సవాలుగా మారిందని చందోక్ అభిప్రాయపడ్డారు. ఇటువంటి మార్కెట్ సవాళ్లను సమర్థవంతంగా అధిగమిస్తూ, భారతదేశంలో రాబోయే కాలంలో తలెత్తే ఏఐ విప్లవానికి మైక్రోసాఫ్ట్ ముందంజలో ఉండి సారథ్యం వహిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రతిష్ఠాత్మక డేటా సెంటర్ల నిర్మాణ స్థలాల వివరాలను పరిశీలిస్తే, హైదరాబాద్ శివార్లలోని షాద్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఇవి వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. షాద్‌నగర్ ప్రాంతంలో దాదాపు 41 ఎకరాల విస్తీర్ణంలో, మేకగూడ పరిధిలో 22 ఎకరాల స్థలంలో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీటితో పాటు చందన్‌వెల్లి పారిశ్రామిక ప్రాంతంలో అత్యంత భారీగా 53 ఎకరాల విస్తీర్ణంలో మైక్రోసాఫ్ట్ సంస్థ తమ డేటా సెంటర్ల సముదాయాన్ని నిర్మిస్తోంది. దీనికి అదనంగా సమీపంలోని కొత్తూర్, నందిగామ వంటి వ్యూహాత్మక ప్రాంతాల్లో కూడా సంస్థ పలు స్థలాలను కొనుగోలు చేసినట్లు పరిశ్రమ వర్గాల ద్వారా నమ్మదగిన సమాచారం అందుతోంది. దేశీయంగా ఉన్న అగ్రశ్రేణి ఐటీ దిగ్గజాలు మైక్రోసాఫ్ట్ సాంకేతికతకు పూర్తి అండగా నిలుస్తున్నాయి. భారతీయ ఐటీ రంగంలో అగ్రగామిగా ఉన్న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఇన్ఫోసిస్ సంస్థలతో పాటు కాగ్నిజెంట్ వంటి బహుళజాతి కంపెనీలు మైక్రోసాఫ్ట్ ఏఐ సేవలను భారీ ఎత్తున ఇప్పటికే వినియోగిస్తున్నాయి. ఈ ప్రముఖ సాంకేతిక సంస్థలు ఒక్కోటి దాదాపు 50,000కు పైగా కోపైలెట్ లైసెన్సులను కొనుగోలు చేయడం విశేషం. ఈ భారీ వాణిజ్య ఒప్పందాల కారణంగా క్లౌడ్ మౌలిక వసతుల అవసరం మరింతగా పెరిగింది. హైదరాబాద్ నగరం భౌగోళికంగా, వ్యూహాత్మకంగా డేటా సెంటర్ల స్థాపనకు ఎంతో అనుకూలమైన ప్రాంతంగా నిలుస్తోంది. ఇక్కడి స్థిరమైన భూభాగం, భూకంపాలు వంటి సహజ విపత్తుల ముప్పు లేకపోవడం అంతర్జాతీయ సంస్థలకు ప్రధాన ఆకర్షణగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, అంతరాయం లేని విద్యుత్ సరఫరా, మెరుగైన రవాణా సదుపాయాలు ఈ మెగా ప్రాజెక్టు విజయవంతానికి దోహదం చేస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ నిర్మిస్తున్న ఈ భారీ క్లౌడ్ కేంద్రం ద్వారా స్థానికంగా ఎంతో మంది సాంకేతిక నిపుణులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఆసియా పసిఫిక్ ప్రాంతంలోనే హైదరాబాద్ అతిపెద్ద డేటా హబ్‌గా అవతరించనుంది. డిజిటల్ లావాదేవీలు, క్లౌడ్ స్టోరేజ్ అవసరాలు రోజురోజుకూ పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఈ కేంద్రం దేశీయ డిజిటల్ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయనుంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమల నుంచి బహుళజాతి కంపెనీల వరకు అందరికీ వేగవంతమైన, సురక్షితమైన క్లౌడ్ సేవలను అందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని సామాన్యుడికి సైతం చేరవేయాలనే లక్ష్యంతో మైక్రోసాఫ్ట్ ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సేవల విస్తరణకు ఈ డేటా సెంటర్లు ఒక బలమైన పునాదిగా నిలవనున్నాయి. మైక్రోసాఫ్ట్ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల మరిన్ని అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్ వైపు చూసే అవకాశం ఉంది. నగర ఐటీ రంగాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్లడంలో ఈ పెట్టుబడులు కీలక మైలురాయిగా నిలుస్తాయి. సాంకేతిక ఆవిష్కరణలకు కేంద్ర బిందువుగా మారుతున్న భాగ్యనగరం, ఈ మెగా డేటా సెంటర్ ప్రారంభంతో ప్రపంచ ఐటీ పటంలో తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకోనుంది.




# ఒంటరిగా బరిలోకి దిగుతున్నాం..!

**మొదటిపేజీ తరువాయి**

అవసరం ఎంతైనా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రయోజనాలను కాపాడటం కోసం వచ్చే ముప్పై రోజుల్లోగా ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుపేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు తమ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. విద్యా రంగానికి బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, ఫీజుల భారం తగ్గించకపోతే విద్యార్థి లోకాన్ని ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను, ఉద్యమకారుల శ్రమను ప్రస్తుత పాలకులు పూర్తిగా విస్మరించారని కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ రెండు నాటికి ఉద్యమకారులకు, అమరుల కుటుంబాలకు గతంలో ఇచ్చిన అన్ని వాగ్దానాలను నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు. గడువులోగా ప్రభుత్వం స్పందించి హామీలను అమలు చేయకపోతే, బాధితుల పక్షాన నిలబడి రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు. అమరుల కుటుంబాలకు ఉపాధి, ఆర్థిక సహాయం అందించడంలో పాలకులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని, దీనికి కాలమే సమాధానం చెబుతుందని మండిపడ్డారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో తెలంగాణ ఉద్యమ కాలంలో నిర్మించిన అమరుల స్థూపం దయనీయ స్థితిపై ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ప్రాంతంలో అమరుల స్థూపాన్ని నిర్మించి ఇప్పటికే ఇరవై ఏళ్లు పూర్తవుతున్నా, ఇప్పటివరకు దాన్ని అధికారికంగా ఆవిష్కరించకపోవడం బాధాకరమని అన్నారు. రాబోయే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం లోపల ప్రభుత్వమే చొరవ తీసుకుని ఆ స్థూపాన్ని ఘనంగా ఆవిష్కరించాలని కోరారు. ఒకవేళ పాలకులు ఈ విషయంలో వెనకడుగు వేస్తే, తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో తామే స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి ఆ అమరుల స్థూపాన్ని ఆవిష్కరిస్తామని కవిత సంచలన ప్రకటన చేశారు. గతంలో తెలంగాణ ఉద్యమ పార్టీ అని చెప్పుకుంటూ ప్రజల ఓట్లతో గెలిచిన నాయకులు సైతం అమరవీరుల స్మారక చిహ్నాల పట్ల ఘోరమైన నిర్లక్ష్యం వహించారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార దాహంతో ఉద్యమ ఆశయాలను పక్కనబెట్టారని విమర్శించారు. కుత్బుల్లాపూర్ మట్టికి ఉద్యమ చరిత్ర ఉంది, ఇక్కడి ప్రజలు ఎల్లప్పుడూ న్యాయం వైపే నిలబడతారని కొనియాడారు. ఇరవై ఏళ్ల కాలంగా పెండింగ్‌లో ఉన్న స్థూపం అంశాన్ని కేవలం ఓట్ల రాజకీయాల కోసమే పాలకులు వాడుకున్నారని, కానీ దానికి కనీస గౌరవం ఇవ్వాలనే ఆలోచన చేయకపోవడం వారి అహంకారానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ఈ రోజు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పార్టీ జెండాను ఘనంగా ఎగురవేసుకోవడం ద్వారా తమ విజయయాత్ర ప్రారంభమైందని కవిత ధీమా వ్యక్తం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన సాధించబోయే స్థానాల లెక్క ఇక్కడి నుంచే మొదలవుతుందని స్పష్టం చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే సీటును టీఆర్ఎస్ పార్టీ కచ్చితంగా కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక్కడి ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, తమ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలతో పాటు త్వరలో రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ తమ పార్టీ సత్తా చాటుతుందని కవిత వెల్లడించారు. నగర పరిధిలోని నూట యాభై డివిజన్లలోనూ తెలంగాణ రక్షణ సేన అభ్యర్థులను బరిలోకి దించుతామని అధికారికంగా ప్రకటించారు. ప్రతి డివిజన్‌లో స్థానిక సమస్యలపై పోరాడుతూ ప్రజలకు చేరువవుతామని చెప్పారు. హైదరాబాద్ మహానగర అభివృద్ధి కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితమైందని, శివారు ప్రాంతాలైన కుత్బుల్లాపూర్ వంటి నియోజకవర్గాల్లో మౌలిక వసతుల కల్పన పూర్తిగా పడకేసిందని, వీటన్నింటిపై జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్తామన్నారు. తెలంగాణ సమాజంలోని ప్రతి ఒక్క పౌరుడి హక్కులను పరిరక్షించడం కోసమే తెలంగాణ రక్షణ సేన ఆవిర్భవించిందని ఆమె పునరుద్ఘాటించారు. తమ పార్టీ ఏ ఒక్క వర్గానికో పరిమితం కాలేదని, నాలుగు కోట్ల ప్రజల ఆశయాలకు ప్రతిరూపమని కొనియాడారు. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో స్థానికులకు జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకోవడానికి తమ శ్రేణులు నిరంతరం సిద్ధంగా ఉంటాయని చెప్పారు. పాలకుల తప్పుడు విధానాల వల్ల నష్టపోతున్న రంగాలు, వర్గాలను కాపాడుకోవడానికి ఒక బలమైన వేదిక అవసరమని, ఆ బాధ్యతను తమ పార్టీ సంపూర్ణంగా భుజాన ఎత్తుకుంటుందని భరోసా ఇచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పారిశ్రామిక ప్రాంతాల్లో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రస్తుత యంత్రాంగం పూర్తిగా విఫలమైందని కవిత విమర్శించారు. నియోజకవర్గంలో వేలాది మంది చదువుకున్న నిరుద్యోగులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతుంటే, స్థానిక ప్రజాప్రతినిధులు మాత్రం తమ స్వంత ఆస్తులను పెంచుకోవడంలో నిమగ్నమయ్యారని ఆరోపించారు. ప్రభుత్వ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా కాలయాపన చేయడం వల్ల యువత మానసిక వేదనకు గురవుతోందని, దీనిపై తాము త్వరలోనే ఒక సమగ్ర కార్యాచరణతో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. తెలంగాణ రక్షణ సేన శ్రేణులు రాబోయే రోజుల్లో ప్రతి గ్రామం, ప్రతి వార్డు పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకోవాలని కవిత పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు కేవలం ఎన్నికల సమయాల్లోనే కాకుండా నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలని సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జరిగిన ఈ భారీ చేరికలు రాష్ట్రంలో రాబోయే రాజకీయ మార్పునకు స్పష్టమైన సంకేతాలని ఆమె విశ్లేషించారు. తమ పార్టీని ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు తమ ప్రాణం ఉన్నంతవరకు పోరాటం కొనసాగిస్తామని సభాముఖంగా కవిత స్పష్టం చేశారు.



# హైదర్‌నగర్‌లో కలుషిత నీరు

**సైబరాబాద్ - విశాల భారతి**

హైదర్‌నగర్‌లో కలుషిత నీరు బయటపడ్డ ఘటనపై 'విశాల భారతి'లో వెలువడిన కథనానికి జలమండలి ఎండీ అశోక్ రెడ్డి వెంటనే స్పందించారు. నీటి సరఫరాపై శుక్రవారం జలమండలిలోని వివిధ ప్రాంతాల అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించి లైన్‌మెన్లు, సెక్షన్ మేనేజర్లు, డీజీఎంలు, జీఎంలకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. పలు ప్రాంతాల్లో లైన్‌మెన్లు షెడ్యూల్ సమయం దాటి సరఫరాలను మానిప్యులేట్ చేస్తున్నారని, ఎక్కువ నీరు వదలడానికి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వార్తాపత్రికలో ఆరోపణలు వచ్చాయని ఎండీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ పే ద్వారా డబ్బులు తీసుకున్నట్లు స్క్రీన్‌షాట్ ఆధారాలు కూడా బయటకు వచ్చాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎండీ కీలక ఆదేశాలు జారీ చేశారు. గత 2 సంవత్సరాల మీటర్ రీడింగ్స్ మొత్తం వెరిఫై చేయాలని, అసాధారణ రీడింగ్ కనిపిస్తే బోర్డు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అన్ని రిజర్వాయర్లు, వాల్వ్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ పెంచాలని, వాల్వ్ ఆపరేషన్ లాగ్ బుక్ తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. కలుషిత నీటి ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాల్లో ప్రతిరోజూ క్లోరిన్ పరీక్షలు నిర్వహించి నివేదికలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. 1916 కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులను 24 గంటల్లో పరిష్కరించాలని, పెండింగ్ ఉంచితే సంబంధిత అధికారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జీఎంలు, డీజీఎంలు వారానికి రెండుసార్లు ఫీల్డ్‌లో ఆకస్మిక తనిఖీలు చేసి నివేదిక సమర్పించాలని పేర్కొన్నారు. ఆర్థిక వ్యవహారాల్లో అప్రమత్తంగా ఉండాలని, అవినీతి, నిర్లక్ష్యానికి పాల్పడితే లైన్‌మెన్ నుంచి జీఎం స్థాయి వరకు ఎవరినీ ఉపేక్షించబోమని తేల్చి చెప్పారు. హైదర్‌నగర్ కలుషిత నీటి ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, నాణ్యమైన నీటి సరఫరాకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎండీ అధికారులను ఆదేశించారు.



జలమండలి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎండి అశోక్ రెడ్డి.



**ప్రజాసంఘాల హర్షం:** జలమండలి ఎండీ స్పందనపై ప్రజాసంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. సీఐటీయూ శేరిలింగంపల్లి కార్యదర్శి కొంగరి కృష్ణ మాట్లాడుతూ, ఎండీ అశోక్ రెడ్డి జలమండలిలోని ఆయా ప్రాంతాల సెక్షన్ మేనేజర్ నుంచి జీఎం వరకు సమీక్ష నిర్వహించి సత్వరమే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని ఆదేశించడం హర్షించదగ్గ విషయమని, ప్రజల తరఫున వారికి ధన్యవాదాలు తెలిపారు.


DISTRICT news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి

హైదర్ నగర్‌లో కలుషిత నీరు, జలమండలి నిర్లక్ష్యం బట్టబయలు

పాలకులకు, అధికారులకు పట్టదా? .. ప్రశ్నిస్తున్న ప్రజా సంఘాలు

45 నిమిషాల నీళ్లు కూడా భారమా?

Main Edition Page 5 21 May 2026
For Advertisement Call +91 99121 62531

# మైనర్ బాలికతో బీఆర్ఎస్ రాజకీయం



**మొదటిపేజీ తరువాయి**

క్షుణ్ణంగా చర్చించి, క్షేత్రస్థాయి పరిశీలన జరిపిన అనంతరం కనీస వేతనాల పెంపునకు ఆమోదముద్ర వేసిందని వివరించారు. ఈ ప్రక్రియలో భాగంగా కార్మికుల నైపుణ్యాలను బట్టి వారిని అన్‌స్కిల్డ్, సెమీస్కిల్డ్, స్కిల్డ్, హైలీస్కిల్డ్ అనే నాలుగు ప్రధాన విభాగాలుగా వర్గీకరించినట్లు చెప్పారు. అలాగే భౌగోళిక పరిస్థితులను బట్టి రాష్ట్రవ్యాప్తంగా జోన్లను మూడు విభాగాలుగా విభజించి శాస్త్రీయంగా వేతనాలను ఖరారు చేశామన్నారు. అందులో భాగంగా జోన్ 1 పరిధిలోకి మున్సిపల్ కార్పొరేషన్లు, జోన్ 2 కిందికి మున్సిపాలిటీలు, జోన్ 3 పరిధిలోకి గ్రామీణ ప్రాంతాలను తీసుకొచ్చి సమన్యాయం చేకూర్చామని వెల్లడించారు. ఈ సరికొత్త వేతనాల సవరణ ద్వారా అన్‌స్కిల్డ్ కేటగిరీ శ్రామికుల కనీస వేతనాన్ని రూ.12,750 నుండి ఏకంగా రూ.16 వేలకు పెంచినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారికంగా వెల్లడించారు. సెమీస్కిల్డ్ విభాగంలో పని చేసే వారికి రూ. 13,152గా ఉన్న వేతనాన్ని రూ.17 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నామన్నారు. స్కిల్డ్ కేటగిరీ కింద కార్మికులకు రూ. 13,772 నుండి రూ. 18,500 వరకు లబ్ధి చేకూరనుండగా, హైలీస్కిల్డ్ నిపుణులకు రూ.14,607 నుండి ఏకంగా రూ.20 వేలకు వేతనాన్ని పెంచినట్లు స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వ అద్భుతమైన నిర్ణయం వల్ల రాష్ట్రంలోని ఒక కోటి పదకొండు లక్షల మంది కార్మిక కుటుంబాల జీవితాల్లో సరికొత్త వెలుగులు నిండుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత కార్మిక సంక్షేమం కోసం ఇంతటి భారీ స్థాయిలో సాహసోపేత నిర్ణయం తీసుకోవడం ఇదే ప్రథమమని సగర్వంగా ప్రకటించారు. శ్రామిక శక్తినే నమ్ముకున్న నిరుపేద వర్గాల ప్రయోజనాలను కాపాడటం తమ ప్రభుత్వ కనీస బాధ్యతగా భావించి ఈ ముందడుగు వేశామని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత కేవలం ఐటీ రంగం, అమెరికా ఉద్యోగాల చుట్టూనే తిరిగే సంప్రదాయ ఆలోచనా ధోరణిని వీడాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మార్కెట్ అవసరాలకు ఉపయోగపడని, ఉపాధి అవకాశాలను సృష్టించలేని చదువులు, డిగ్రీలు కేవలం కాగితాలకే పరిమితమై వ్యర్థంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత గ్లోబల్ మార్కెట్‌లో సాంకేతిక నైపుణ్యాలకు విపరీతమైన గిరాకీ ఉందని, జర్మనీ, జపాన్, సింగపూర్ వంటి విదేశాల్లో అద్భుతమైన అవకాశాలు వేచి చూస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర యువత అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను అందిపుచ్చుకుని గ్లోబల్ లీడర్లుగా ఎదగాలనే ఆకాంక్షతోనే తమ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'స్కిల్ యూనివర్సిటీ'ని స్థాపించిందని తెలిపారు. మారుతున్న టెక్నాలజీ యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విప్లవం వల్ల వైట్ కాలర్ ఉద్యోగాలకు భారీగా ముప్పు పొంచి ఉన్న మాట వాస్తవమేనని, అయితే చేతివృత్తులు, సాంకేతిక నైపుణ్యాలు గల బ్లూ కాలర్ ఉద్యోగాలకు మాత్రం ఎప్పటికీ ఎలాంటి ఢోకా ఉండదని భరోసా ఇచ్చారు. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం నైపుణ్యాలు పెంచుకుంటే ఉద్యోగ భద్రత గురించి ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నైపుణ్యం గల మానవ వనరుల కోసం వివిధ విదేశీ సంస్థలు నిరంతరం తమను సంప్రదిస్తున్నాయని, యువతకు అవసరమైన అన్ని రకాల శిక్షణ, ప్రోత్సాహకాలను ప్రభుత్వమే అందిస్తుందని స్పష్టం చేశారు. నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా విదేశాల్లో నెలకు రూ.2 లక్షల వరకు అత్యుత్తమ వేతనాలు సాధించవచ్చని యువతకు దిశానిర్దేశం చేశారు. సాధారణ ప్రజల రోజువారీ సమస్యలను, అంతర్జాతీయంగా జరుగుతున్న దేశాల మధ్య యుద్ధాలను సైతం కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని మోదీ ప్రభుత్వం కేవలం తమ స్వార్థ రాజకీయ కోణంలోనే చూస్తోందని రేవంత్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. ఎన్నికల పర్వం ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరలను రోజువారీగా పెంచుకుంటూ పోతూ సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ స్వల్పకాలిక ఎత్తుగడలకు భిన్నంగా, తమ ప్రజా ప్రభుత్వం ప్రతి ఒక్క అంశాన్ని భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు తీసుకెళ్తుందని స్పష్టం చేశారు. కార్మికుల కనీస వేతనాల పెంపు వంటి సాహసోపేతమైన ముందడుగులు తమ ప్రభుత్వ దూరదృష్టికి, పేదల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు..

# కళ్లు తెరవండి.. ధాన్యం కొనండి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో నెలకొన్న వరి ధాన్యం కొనుగోళ్ల సంక్షోభంపై గురువారం ఆయన సీఎంకు ఒక బహిరంగ లేఖ రాశారు. ఈనెల 23వ తేదీన నిర్వహించబోయే మంత్రివర్గ సమావేశంలోనైనా క్షేత్రస్థాయి పరిస్థితులపై ప్రభుత్వం కండ్లు తెరవాలని డిమాండ్ చేశారు. అన్నదాతల ఆవేదనను ఆలకించకుండా సాగుతున్న మొద్దునిద్రను వీడాలని హితవు పలికారు. ప్రస్తుతం తెలంగాణలో రోడ్డెక్కని రైతు లేడని, రాస్తారోకోలు జరగని రహదారే లేదంటూ ఘాటుగా విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటా పెట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్న పాలకులకు కాలం చెల్లిందని హెచ్చరించారు. రాష్ట్రంలో తొమ్మిదిన్నరేళ్లపాటు అత్యంత ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో జీవించిన రైతన్న నేడు కాంగ్రెస్ మార్కు పాలన వల్ల నడిరోడ్డున పడ్డాడని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు దశాబ్దాల పాటు సాగిన ఇబ్బందులన్నీ శాశ్వతంగా తొలగిపోయాయనే సంతోషంతో సాగు చేసుకుంటున్న కర్షకుల నోట్లో ఈ ప్రభుత్వం మట్టి కొట్టిందని ధ్వజమెత్తారు. గత కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన ప్రతీ అభ్యుదయ పథకాన్ని నాశనం చేస్తూ, గడిచిన కాలంగా అన్నదాతల వెన్నువిరిచేలా నిర్ణయాలు తీసుకున్నారని మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వ అరాచక వైఖరికి, పాలనా వైఫల్యానికి క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న దృశ్యాలే నిదర్శనమని లేఖలో పేర్కొన్నారు. అష్టకష్టాలు పడి పండించిన పంటను కొనుగోలు చేసే నాథుడే కరువవ్వడంతో గత రెండు నెలలుగా రైతాంగం కొనుగోలు కేంద్రాల్లో ఆర్తనాదాలు చేస్తోందని కేటీఆర్ వివరించారు. రాష్ట్రంలోని ఏ మూలన చూసినా ధర్నాలు, నిరసనలతో గ్రామీణ ప్రాంతాలు హోరెత్తుతున్నాయని చెప్పారు. కష్టపడి తెచ్చిన ధాన్యాన్ని అమ్ముకోవాలనే ఆశతో వచ్చిన రైతులు, రోజుల తరబడి ఐకేపీ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే మానసిక ఆందోళన తట్టుకోలేక కొంతమంది గుండె పగిలి కుప్పకూలుతున్నా పాలకుల్లో చలనం లేకపోవడం దారుణమన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్టయినా లేకపోవడం వారి బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తోందని విమర్శించారు. పాలనాపరమైన ప్రయోజనాల కోసం ఢిల్లీ చుట్టూ డెబ్బై సార్లు చక్కర్లు కొట్టేందుకు చూపిస్తున్న శ్రద్ధలో, ఒక్క శాతం కూడా రైతుల సమస్యలపై పెట్టకపోవడం శోచనీయమని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కేవలం కుర్చీని కాపాడుకునేందుకు, అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు ఉన్న ఆరాటం రైతుల ధాన్యాన్ని సేకరించడంలో కనిపించడం లేదని ఆరోపించారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద నిరీక్షిస్తూ దాదాపు పది మంది రైతులు తమ నిండు ప్రాణాలను కోల్పోయారని గుర్తుచేశారు. ఇంతటి విషాదం జరుగుతున్నా ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ ఒక్కసారైనా ఏ ఒక్క కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన దాఖలాలు లేవని దుయ్యబట్టారు. చివరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో సైతం రైతులు రోడ్డెక్కి పాలకులను దుమ్మెత్తిపోసే దుస్థితి వచ్చిందంటే రాష్ట్రంలో సాగు రంగం ఎంతటి తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందో అర్థం చేసుకోవచ్చని కేటీఆర్ పేర్కొన్నారు గత బీఆర్ఎస్ హయాంలో పంటల కొనుగోలుకు సంబంధించి మూడు నెలల ముందే పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేసేవారమని గుర్తుచేశారు గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడటం నుంచి మొదలుకొని రైతుల ఖాతాల్లో సకాలంలో నగదు జమ అయ్యే వరకు నిరంతరం ఉన్నత స్థాయి సమీక్షలు నిర్వహించే సంప్రదాయం ఉండేదని వివరించారు. రైతుల కన్నీళ్లను, వారి ఆర్తనాదాలను ఏమాత్రం పట్టించుకోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని కేటీఆర్ స్పష్టం చేశారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా పాతాళంలోకి నెట్టేసిన ఈ వైఫల్య పాలనపై ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుబాటు మొదలైందని హెచ్చరించారు. యాసంగి వరి కోతలు పూర్తయి 60 రోజులు గడుస్తున్నా, కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న పాలకులకు మరణశాసనం రాసేందుకు రైతాంగం సిద్ధంగా ఉందన్నారు. ఇవాళ కొనుగోలు కేంద్రాల వద్ద బూతులు తిడుతున్న రైతులు, రేపు ఓట్ల రూపంలో వాతలు పెట్టడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈనెల 23న నిర్వహించే కేబినెట్ సమావేశాన్ని ఒక అవకాశంగా తీసుకుని ప్రభుత్వం తప్పులను సరిదిద్దుకోవాలని కేటీఆర్ సూచించారు. వేలాది కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని తక్షణమే సేకరించి, రైతుల కష్టానికి తగిన ప్రతిఫలాన్ని త్వరగా అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అలసత్వం కారణంగా ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద ప్రాణాలు కోల్పోయిన రైతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించాలని లేఖలో కోరారు. తక్షణమే ఈ దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే చరిత్రలో ఎప్పటికీ రైతు ద్రోహిగానే మిగిలిపోతారని కేటీఆర్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఐకేపీ కేంద్రాల పరిధిలో తలెత్తిన సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ డిమాండ్ చేశారు. మిల్లుల వద్ద జరుగుతున్న తరుగు దోపిడీని అరికట్టడంతో పాటు తేమ శాతం నెపంతో రైతులను వేధించడాన్ని సహించేది లేదన్నారు. ఇప్పటికైనా సోషల్ మీడియా ప్రచార ఆర్భాటాలు పక్కన పెట్టి, క్షేత్రస్థాయిలో అన్నదాతలకు భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే కేబినెట్ వేదికగా రైతాంగ సంక్షేమానికి సంబంధించి స్పష్టమైన కార్యాచరణను ప్రకటించని పక్షంలో, బీఆర్ఎస్ పక్షాన పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# సీఎం వ్యాఖ్యలు సిగ్గుచేటు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందేలా చేయడంలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీని చూసి స్ఫూర్తి పొందాలంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై భారతీయ జనతా పార్టీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు కేవలం గర్హనీయమే కాకుండా అత్యంత విడ్డూరంగా ఉన్నాయని బీజేపీ సీనియర్ నాయకుడు, హైదరాబాద్ నగర బీజేపీ చీఫ్ ఎన్ రాంచందర్ రావు తీవ్రంగా విమర్శించారు. చారిత్రక వాస్తవాలను పక్కనబెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ నాయకులు ఇలాంటి అసత్య ప్రచారాలకు ఒడిగడుతున్నారని ఆయన మండిపడ్డారు. గురువారం నాడు ఆయన హైదరాబాద్ లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మీడియా సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు గట్టి కౌంటర్ ఇచ్చారు. రాజీవ్ గాంధీ దేశ ప్రధానిగా ఉన్న కాలంలో కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభలో నాలుగు వందలకు పైగా ఎంపీ స్థానాలతో తిరుగులేని, అఖండమైన మెజారిటీ ఉండిందని ఎన్ రాంచందర్ రావు ఈ సందర్భంగా గుర్తు చేశారు. దేశ రాజకీయ చరిత్రలో అంతటి అద్భుతమైన అత్యధిక బలంతో ప్రధానమంత్రి పీఠంపై కూర్చున్న రాజీవ్ గాంధీ, ఆ అఖండ బలాన్ని మహిళా రిజర్వేషన్ బిల్లును చట్టసభల్లో ఆమోదింపజేయడానికి ఏమాత్రం ఉపయోగించలేదని ఆయన స్పష్టం చేశారు. అంతటి సంపూర్ణ మెజారిటీ ఉండి కూడా మహిళా సాధికారతకు అత్యంత కీలకమైన ఆ బిల్లును పార్లమెంటులో ఆమోదింపజేయడంలో రాజీవ్ గాంధీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అసలు ఆ దిశగా చిత్తశుద్ధితో అడుగులు వేయలేదని ఆయన ఆరోపించారు. తిరుగులేని అధికారం చేతిలో ఉన్నప్పుడు మహిళా హక్కుల గురించి పట్టించుకోని కాంగ్రెస్ పార్టీ, నేడు మోదీ ప్రభుత్వానికి నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాజీవ్



గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల పట్ల ఎలాంటి వివక్షాపూరిత వైఖరిని ప్రదర్శించిందో చెప్పడానికి చారిత్రాత్మకమైన షా బానో కేసే ఒక స్పష్టమైన నిదర్శనమని రాంచందర్ రావు పేర్కొన్నారు. ఆనాడు షా బానో కేసులో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన అత్యంత చరిత్రాత్మక తీర్పును రాజీవ్ గాంధీ ప్రభుత్వం పూర్తిగా పక్కదారి పట్టించిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. భర్త నుంచి విడాకులు తీసుకున్న ఒక వృద్ధ ముస్లిం మహిళకు చట్టబద్ధంగా దక్కాల్సిన న్యాయమైన భరణాన్ని, జీవనభృతిని సైతం నిరాకరించేలా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంటులో ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చి సుప్రీంకోర్టు తీర్పును నీరుగార్చిందని ధ్వజమెత్తారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం, మత సంప్రదాయవాదులను సంతృప్తి పరచడం కోసం ఒక అణగారిన ముస్లిం మహిళకు దక్కాల్సిన న్యాయాన్ని వారి ప్రభుత్వం పూర్తిగా దుర్వినియోగం చేసిందని వివరించారు. మహిళల హక్కుల రక్షణ విషయంలోను, వారి సామాజిక సాధికారత విషయంలోను కాంగ్రెస్ పార్టీకి ఉన్న అసలు సిసలైన ట్రాక్ రికార్డ్ ఇదేనని రాంచందర్ రావు ఎద్దేవా చేశారు. చట్టసభల్లో మహిళలకు ముప్పై మూడు శాతం కోటా కల్పించే మహిళా రిజర్వేషన్ బిల్లును దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ కావాలనే జాప్యం చేస్తూ వచ్చిందని, పార్లమెంటులో వివిధ రూపాల్లో అడ్డుకుందని విమర్శించారు. కేవలం అడ్డుకోవడమే కాకుండా ఆ బిల్లు సభలో వీగిపోయేలా చేయడంలో కాంగ్రెస్ పార్టీ లోపాయికారీ వ్యూహాలను అమలు చేసిందని దుయ్యబట్టారు. చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యాన్ని పెంచే ఈ బిల్లును కాంగ్రెస్ పార్టీ నాడు ఒక్కసారి కాదు, రెండుసార్లు కాదు, ఏకంగా ఏడుసార్లు పార్లమెంటు పరిధిలో పెండింగ్‌లో పెడుతూ చివరకు వీగిపోయేలా చేసిందని రాంచందర్ రావు లెక్కలతో సహా నిలదీశారు. అలాంటి అప్రజాస్వామిక, మహిళా వ్యతిరేక చరిత్రను వెనుక పెట్టుకుని నేడు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మహిళా సాధికారత పై, వారి హక్కుల రక్షణపై పెద్ద పెద్ద నీతులు చెప్పడం అత్యంత సిగ్గుచేటని రాంచందర్ రావు మండిపడ్డారు. దేశంలో మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని విమర్శించే అర్హత కాంగ్రెస్ నేతలకు లేదన్నారు. మహిళా సాధికారత అనే చారిత్రాత్మక విషయంపై బహిరంగంగా మాట్లాడే నైతిక హక్కును, అర్హతను కాంగ్రెస్ పార్టీ ఎప్పుడో కోల్పోయిందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. దశాబ్దాలుగా నలిగిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం పార్లమెంటులో ప్రత్యేక ఆమోదం తెలిపి చట్టరూపం తీసుకువచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ చేసిన ద్రోహాన్ని దేశ ప్రజలు, ముఖ్యంగా మహిళా లోకం ఎప్పటికీ మరిచిపోదని రాంచందర్ రావు అన్నారు. కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసం, రాజకీయ మనుగడ కోసం రేవంత్ రెడ్డి వంటి నేతలు చరిత్రను తిరరాయాలని చూస్తున్నారని, అయితే ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని హెచ్చరించారు. పార్లమెంటులో నాలుగు వందలకు పైగా స్థానాలు ఉన్నప్పుడు మహిళా బిల్లును ఆమోదించని కాంగ్రెస్, ఇన్నాళ్లకు ఆ బిల్లును చట్టంగా మార్చిన బీజేపీ ప్రభుత్వాన్ని చూసి విమర్శలు చేయడం ముమ్మాటికీ రాజకీయ దివాలాకోరతనమే అవుతుందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు తమ గత వైఫల్యాలను ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే స్వచ్ఛ భారత్ కింద కోట్ల సంఖ్యలో మరుగుదొడ్ల నిర్మాణం, ఉజ్వల యోజన ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ, ముమ్మారు తలాక్ రద్దు వంటి విప్లవాత్మక నిర్ణయాలతో మహిళల జీవితాల్లో నిజమైన వెలుగులు వచ్చాయని రాంచందర్ రావు వివరించారు. కాంగ్రెస్ పార్టీ కేవలం మహిళలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసిందని, కానీ బీజేపీ వారిని దేశ ప్రగతిలో భాగస్వాములను చేసిందని కొనియాడారు. నారీ శక్తి వందన్ అధినియం ద్వారా మహిళా రిజర్వేషన్ బిల్లును సాకారం చేసిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని, దీనిని చూసి కాంగ్రెస్ అసూయపడుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని, కేంద్ర ప్రభుత్వంపై బురద చల్లడం మానుకోవాలని రాంచందర్ రావు హితవు పలికారు. చరిత్రలో కాంగ్రెస్ పార్టీ మహిళా బిల్లును ఏడుసార్లు అడ్డుకున్న తీరును రాష్ట్రంలోని మహిళలకు తాము వివరించి చెబుతామని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి తన ఉనికిని చాటుకోవడానికే ప్రధాని మోదీపై ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని, తెలంగాణలో కాంగ్రెస్ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే ఈ తరహా వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని రాంచందర్ రావు హెచ్చరించారు.

## జర్నలిస్ట్ మడ్డి వీరన్న తండ్రిని పరామర్శించిన టీయూడబ్ల్యూజే నాయకులు



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ పట్టణంలోని ధరణి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న సీరోలు మండలం చింతపల్లి గ్రామానికి చెందిన జర్నలిస్ట్ మడ్డి వీరన్న తండ్రి చంద్రయ్యను టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మహబూబాబాద్ జిల్లా నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిపల్లి శ్రీహరి ఆసుపత్రికి వెళ్లి చంద్రయ్య ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జర్నలిస్టుల కుటుంబాలకు సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వారు పేర్కొన్నారు.

## రాజీవ్ గాంధీకి ఘన నివాళులు

- మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్




**మహబూబాబాద్ విశాలభారతి:** మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా గురువారం రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశానికి ఆధునిక సాంకేతిక విప్లవానికి మార్గదర్శకుడని కొనియాడారు. ఆయన హయాంలోనే దేశం టెక్నాలజీ వైపు వేగంగా అడుగులు వేసిందన్నారు. గ్రామ పంచాయతీలకు రాజ్యాంగ హోదా కల్పించడం, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం వంటి ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు రాజీవ్ గాంధీ తీసుకున్నారని గుర్తుచేశారు. రాజీవ్ గాంధీ కలలుగన్న డిజిటల్ ఇండియా నేడు సాకారమవుతోందని పేర్కొన్నారు. అలాంటి మహానేతను తీవ్రవాదులు బలిగొనడం దేశానికి తీరని లోటని అన్నారు. ఆయన త్యాగం ఎప్పటికీ వృథా కాదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేదల పక్షాన నిలుస్తుందని, రాజీవ్ గాంధీ ఆశయాలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ముందుకు తీసుకెళ్తున్నారని ఇస్లావత్ సుధాకర్ పేర్కొన్నారు.

## రాజీవ్ గాంధీకి ఘన నివాళులు

- జిల్లా కోశాధికారి గార్లపాటి వెంకట్ రెడ్డి
- రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం
- ఆధునిక భారత నిర్మాణ శిల్పి రాజీవ్ గాంధీ




**కురవి విశాలభారతి:** మాజీ ప్రధానమంత్రి భారతరత్న రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా గురువారం కురవి మండలం గుండ్రాతిమడుగు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా కోశాధికారి గార్లపాటి వెంకట్ రెడ్డి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కోశాధికారి గార్లపాటి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, నేటి యువత రాజీవ్ గాంధీని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. దేశ సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం గాంధీ కుటుంబం తమ ప్రాణాలను అర్పించిందని పేర్కొన్నారు. మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ మరియు రాజీవ్ గాంధీలు దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహానేతలని కొనియాడారు. 1991 మే 21న తమిళనాడులోని శ్రీపెరుంబుదూర్ లో ఎన్నికల ప్రచార సభ సందర్భంగా జరిగిన ఆత్మాహుతి బాంబు దాడిలో రాజీవ్ గాంధీ మరణించడం దేశానికి తీరని లోటని అన్నారు. కేవలం 40 ఏళ్ల వయసులోనే భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టి దేశాన్ని ఆధునిక భారత దిశగా నడిపించిన దూరదృష్టి నాయకుడు రాజీవ్ గాంధీ అని తెలిపారు. టెలికమ్యూనికేషన్ రంగానికి నూతన ఊపిరి పోసి, కంప్యూటర్ యుగానికి బాటలు వేసిన నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, మహిళలకు రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్ ఆలోచన, 18 ఏళ్ల యువతకు ఓటు హక్కు కల్పించడం వంటి సంస్కరణలు రాజీవ్ గాంధీ దూరదృష్టికి నిదర్శనమని తెలిపారు. యువతే దేశ భవిష్యత్తు అనే నమ్మకంతో భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసిన మహానేతగా రాజీవ్ గాంధీ చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు.

## ఆధునిక భారత రాజ్యంగా నిర్మాత స్వర్గీయ రాజీవ్ గాంధీ

- ఆకుల ఇంద్రసేనారెడ్డి



**చౌటుప్పల్ విశాలభారతి:** రాజీవ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజీవ్ స్మారక భవనంలో భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 36వ వర్ధంతి కార్యమానికి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మరియు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి.ఈ సందర్భంగా మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.అనంతరం ఆయన మాట్లాడుతూ...రాజీవ్ గాంధీ ప్రపంచ దేశాలలో భారత దేశాన్ని అగ్రగామిగా నిలిపేందుకు సాంకేతిక విప్లవం కంప్యూటర్ యుగాన్ని తీసుకొచ్చారని 21ఏళ్ల వయస్సు నుండి 18 ఏళ్లకే ఓటు హక్కును కల్పించిన ఘనత రాజీవ్ గాంధీ అనిఅయన కొనియాడారు.ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి ఈ సందర్భంగా అయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్,రాజీవ్ ట్రస్ట్ ఉపాధ్యక్షులు జింద్రు అంజిరెడ్డి,ప్రధాన కార్యదర్శి ఎంఏ ఖయ్యూం,కార్యదర్శి నల్ల నరసింహ,నాయకులు చింతల సాయిలు,ఆవుల యేసు దాసు, కంచర్ల జంగయ్య,మాదని గోపాల్, బండమీద ఎల్లయ్య, ఎండీ చాంద్ పాషా, ముత్యాల గణేష్,ఉదారీ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ బాలికల కళాశాలలో అడ్మిషన్ ప్రారంభం



**అడవిదేవులపల్లి, విశాలభారతి:** మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం జూనియర్ కాలేజీలో 202627 విద్యా సంవత్సరం 6వ తరగతి,11వ తరగతి ఇంటర్మీడియట్ లో ప్రవేశాలు ప్రారంభమైనట్లు ఎస్ఓ ఎస్.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా తమ విద్యాలయంలో అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. 6వ తరగతి మొత్తం 40 సీట్లు అందుబాటులో ఉన్నాయి.11వ తరగతి ఇంటర్మీడియట్ కంప్యూటర్ సైన్స్ కోర్సు నందు 40 సీట్లు ఉన్నాయన్నారు. సబ్జెక్టుల వారీగా అర్హులైన,ప్రతిభావంతులైన ఉపాధ్యాయ లెక్చరర్ బృందం ద్వారా బోధన, విద్యార్థినులకు ఉచితంగా టెక్స్ బుక్స్,నోట్ బుక్స్, యూనిఫామ్స్ అందజేస్తామన్నారు.విద్యాబోధనతో పాటు కంప్యూటర్ శిక్షణ,విద్యార్థినుల ఆత్మరక్షణ కొరకు ప్రత్యేకంగా కరాటే శిక్షణ ఇవ్వబడుతుంది.ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోజూ మెనూ పాటిస్తూ నాణ్యమైన,పౌష్టిక ఆహారం అందించబడుతుంది. అర్హులైన ఆసక్తి గల విద్యార్థినుల తల్లిదండ్రులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీ పిల్లలను మా పాఠశాల కళాశాలలో చేర్పించి,వారి ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడాలని ఎస్ ఓ నాగలక్ష్మి కోరారు.మరిన్ని వివరాలు అడ్మిషన్స్ వరకు అడవిదేవులపల్లి కేజీబీవీ విద్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.



## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

**చింతల దామోదర్ రెడ్డి సింగిల్ విండో చైర్మన్**

**చౌటుప్పల్ విశాలభారతి:**

ఆరుగాలం చెమటోడ్చి, అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి, పండించిన పంటను అమ్ముకునేందుకు అన్నదాతలు మండే ఎండలో అరిగోస పడుతున్నారు. చౌటుప్పల్ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచినా, అధికారుల నిర్లక్ష్యం, మిల్లర్ల మాయాజాలం వల్ల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మండలంలో మొత్తం 21 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 5, ఐకేపీ మహిళా సంఘాల (ఐకేపీ) ఆధ్వర్యంలో 12, స్వచ్ఛంద సంస్థ (పీపిసి) ఆధ్వర్యంలో మరో 4 కేంద్రాలు నడుస్తున్నాయి. అయితే కేంద్రాలు కాగితాలకే పరిమితమయ్యాయే తప్ప, ధాన్యం కొనుగోళ్లు మాత్రం వేగవంతం కావడం లేదు. ఇప్పటివరకు కనీసం 25 శాతం ధాన్యం కూడా కొనుగోలు చేయక పోవడం అధికారుల ఉదాసీనతకు అద్దం పడుతోంది.



**మిల్లర్ల 'దోపిడీ'.. అధికారుల 'వత్తాసు'!**

ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పక్కనబెట్టి, మ్యాశ్చూర్ (తేమ శాతం) కరెక్ట్‌గా ఉన్నప్పటికీ క్వింటాలుకు 5 కిలోల పైగా అదనంగా తూకం వేస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారు. దీనికి తోడు ఎండ వేడిమికి లారీల్లోనే రోజుల తరబడి ధాన్యం నిల్వ ఉండటం వల్ల బరువు తగ్గుతోందని, ఆ భారాన్ని కూడా రైతులపైనే వేస్తూ 'తరుగు, తాలు' పేరుతో మరింత దోపిడీకి తెరలేపారు. సివిల్ సప్లై అధికారులు మాత్రం క్షేత్రస్థాయికి వచ్చి రైతుల బాధలను ఆలకించాల్సింది పోయి, మిల్లర్లకే వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**రవాణా బంద్.. హమాలీల కొరతతో ముప్పేట తిప్పలు**

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేందుకు తగినన్ని వాహనాలు లేవు. ఒకవేళ లారీలు మిల్లుల వద్దకు వెళ్లినా అక్కడ అన్‌లోడ్ చేయడానికి హమాలీలు రావడం లేదు. మిల్లర్లు ఇచ్చే హమాలీ కూలీ చాలడం లేదని వారు నిరసన తెలుపుతుండటంతో, దిక్కుతోచని స్థితిలో రైతులు తమ సొంత డబ్బులను అదనంగా చెల్లించి హమాలీలతో అన్‌లోడ్ చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అంతేకాకుండా ధాన్యం మిల్లుల వద్ద వెంట వెంటనే అన్లోడ్ కాకపోవడం వల్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లోడ్ చేసుకోవడానికి లారీలు రావడం లేదు. దీంతో కొనుగోలు కేంద్రాలలో ఉన్న హమాలీలు రెండు రోజులకు మూడు రోజులకు ఒక్కసారి లోడ్ చేయాల్సిన పరిస్థితి ఉంటే తమకు కూలి గిట్టుబాటు కావడం లేదని, ఆలా అయితే తాము పనిచేయలేమని, తాము వేరే పనులకు వెళ్లిపోతామని హమాలీలు చెప్తున్నారు.

**సివిల్ సప్లై అధికారులు మిల్లర్లకు వత్తాసు: సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి**

చౌటుప్పల్ మండలంలో ధాన్యం కొనుగోలు విషయంలో సివిల్ సప్లై అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, రైతుల ఇబ్బందులను పట్టించుకోవడంలేదని సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు, లోడింగ్, రైస్ మిల్లుల వద్ద అన్లోడింగ్, హమాలీల సమస్యలను, అదనంగా ధాన్యం తరుగు పేరుతో దోపిడీ చేస్తున్న విషయాలను సివిల్ సప్లై అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకుపోయినప్పటికీ వారు ఏమాత్రం పట్టించుకోకుండా, మిల్లర్లకే వత్తాసు పలుకుతున్నారని, దీనిపై ఉన్నత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. లేదంటే వర్షం కురిస్తే రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం నీటి పాలవుతుందని, రైతులు పెద్ద ఎత్తున నష్టపోతారని దామోదర్ రెడ్డి తెలిపారు. అధికారులు వెంటనే ధాన్యం కొనుగోలును వేగవంతం చేయకపోతే రైతులతో కలిసి, ధాన్యం బస్తాలతో జాతీయ రహదారిని స్తంభింప చేస్తామని చింతల దామోదర్ రెడ్డి హెచ్చరించారు.

## జిల్లా వైద్యాధికారి ఆకస్మిక తనిఖీలు



**మహబూబాబాద్ విశాలభారతి:** మహబూబాబాద్ పట్టణంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీప్తి హాస్పిటల్, పొనుగోటి హాస్పిటల్, వెన్నెల హాస్పిటల్, వీరభద్ర హాస్పిటల్స్‌లలో నిర్వహించిన తనిఖీల సందర్భంగా ఆసుపత్రులలో అమలవుతున్న వైద్య సేవలు, అనుమతులు, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ రోగుల ప్రయోజనార్థం ప్రతి సేవకు సంబంధించిన రుసుములు, అందుబాటులో ఉన్న సౌకర్యాలను తెలుగు మరియు ఆంగ్ల భాషల్లో స్పష్టంగా కనిపించే ప్రదేశాల్లో ప్రదర్శించాలని సూచించారు. అలాగే క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, పొల్యూషన్ తదితర అవసరమైన లైసెన్సులను అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కన్సల్టెంట్ వైద్యుల జాబితా, అగ్నిమాపక శాఖ (112), పోలీస్ (100), అత్యవసర సేవలు (108) వంటి ముఖ్యమైన అత్యవసర నంబర్లను సంస్థ ప్రాంగణంలో తప్పనిసరిగా ప్రదర్శించాలని తెలిపారు. అలాగే రిజిస్ట్రేషన్ నిబంధనలు పాటించని ఆసుపత్రుల రిజిస్ట్రేషన్‌ను ఎప్పుడైనా రద్దు చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని డాక్టర్ రవి రాథోడ్ స్పష్టం చేశారు. అనుమతి పొందిన రేడియాలజిస్టులు లేదా గైనకాలజిస్టులు మాత్రమే గర్భిణులకు స్కానింగ్ నిర్వహించాలని, "ఇక్కడ లింగ నిర్ధారణ చెప్పబడదు" అనే బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫామ్‌ఎఫ్ వివరాలను అదే రోజు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ప్రతి నెల 5వ తేదీలోపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. అదనంగా ప్రతి ఆసుపత్రి నిర్వహణ ఫీజు వివరాల పట్టికను ప్రదర్శించడంతో పాటు ఫైర్ సేఫ్టీ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ తనిఖీల్లో ఇన్‌చార్జి పీఓఎంహెచ్ఎన్ డాక్టర్ విరాజిత, లోక్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్‌లో ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ల ప్రారంభం

**నెహ్రూ సెంటర్, మదర్ థెరిస్సా సెంటర్లలో నూతన సిగ్నల్ వ్యవస్థ ప్రారంభించిన జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్**



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు నెహ్రూ సెంటర్ మరియు మదర్ థెరిస్సా సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన నూతన ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్లను జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, ఐపీఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో రోజు రోజుకు పెరుగుతున్న వాహన రద్దీ, ట్రాఫిక్ సమస్యలు మరియు రోడ్డు ప్రమాదాలను తగ్గించే లక్ష్యంతో ఈ సిగ్నల్ వ్యవస్థను అమలు చేసినట్లు తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించి పోలీసులకు సహకరించాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ అమలుతో వాహనాల రాకపోకలు క్రమబద్ధీకరించబడడంతో పాటు ప్రమాదాల నివారణకు కూడా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతి రావు, టౌన్ సీఐ రఘుపతిరెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ అరుణ్ కుమార్, ట్రాఫిక్ పోలీసులు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఈఏపీసీఈటీలో 30వ ర్యాంక్ సాధించిన కార్తిక్‌కు ఘన సన్మానం

**రాజేంద్రనగర్, విశాలభారతి** : ఆల్మాపూర్ టౌన్‌షిప్‌లోని ప్రశాంతి నగర్ కాలనీకి చెందిన విద్యార్థి కార్తిక్, EAPCETలో 30వ ర్యాంక్ సాధించి ప్రతిభ చాటాడు. ఈ విజయంతో కుటుంబ సభ్యులతో పాటు ప్రాంతీయ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కస్తూరి నరేందర్, పార్టీ అధ్యక్షుడు జితేందర్, కిరణ్, పురుషోత్తం, యలాల నరేష్, ముత్యాలు తదితరులు కార్తిక్ తల్లిదండ్రులను స్వయంగా కలిసి అభినందనలు తెలిపారు. కార్తిక్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందజేశారు.



# రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**బయ్యారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ**

**బయ్యారం విశాలభారతి:** మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా బయ్యారం పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం బయ్యారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్, జెగ్గుతండా సర్పంచ్ జయంతి, వెంకటకృష్ణ పాల్గొని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ,



బయ్యారం మాజీ ఎంపీపీ గుగులోత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ దేశ సమగ్రత, శాంతి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం రాజీవ్ గాంధీ తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. రాజీవ్ గాంధీ వర్ధంతిని దేశవ్యాప్తంగా "ఉగ్రవాద వ్యతిరేక దినం"గా నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రతి భారతీయుడు హింసకు వ్యతిరేకంగా నిలబడి శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. 18 ఏళ్లకే ఓటుహక్కు కల్పించడం, గ్రామీణాభివృద్ధి కోసం పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం, పట్టణాభివృద్ధికి పురపాలక చట్టాల రూపకల్పన, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఆలోచనను ముందుకు తీసుకురావడం వంటి సంస్కరణలు రాజీవ్ గాంధీ దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు. సాంకేతిక విప్లవానికి నాంది పలికిన మహానుభావుడిగా ఆయన సేవలను దేశం గుర్తించి భారతరత్న పురస్కారాన్ని ప్రకటించిందన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

## నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామస్తులు ఎమ్మెల్యేకు వినతి



**బూర్గంపాడు, విశాలభారతి:** యువజన కాంగ్రెస్ శ్రేణులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ ధనుకురాము ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లను పార్టీ కార్యాలయం నందు నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామస్తులు మర్యాదపూర్వకంగా కలిసి రెండవ విడతలో తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పాయం అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నంతకాలం నిరంతరం ప్రక్రియగా కొనసాగుతుందని అన్నారు. విడుతలవారీగా మంజూరు చేసి ప్రతి పేదోడి సొంతింటి కల నెరవేరుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ముందుంది మరింత మంచి కాలం అని గుర్తు చేశారు. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

## గ్రామీణ ఉపాధిహామీకి తూట్లు ఫోటోలకి ఫోజులు

**307/- రూ ప్రజాధనం దుర్వినియోగం.. అధికారుల పర్యవేక్షణ కరువు**



**బూర్గంపాడు, విశాలభారతి:** గ్రామీణ ఉపాధి హామీ పథకం అంటే "కరువు "పని అంటారు కొందరు. ఈ పథకం నిరుపేదలకు ఒక గొప్పవరం, గ్రామీణ ప్రాంత ప్రజల వలసలను నిర్మూలించడానికి 2005 2006 అప్పటి కాంగ్రెస్ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నేతృత్వంలో చట్టబద్ధత కల్పించి అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి వంద రోజుల పని దినాలను కల్పించాలని పటిష్టంగా జీవో జారీ చేసి నిస్సహాయులైన అభాగ్యులకు భరోసా కల్పించారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు ఉపాధి కోసం వలసలు వెళ్లకుండా ఈ పథకం ద్వారా జీవనోపాధి కల్పించి పేదలకు అండగా నిలిచారు. కానీ ఇప్పుడు జరుగుతున్న గ్రామీణ ఉపాధి హామీ "కరువు" పని దుర్వినియోగం అవుతుందని కొందరు వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం కేవైసీ, ఫేస్ యాప్ మొదలగు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నప్పటికీ అక్రమాలు జరగటం విడ్డూరం. నేడు గ్రామీణ ఉపాధి హామీ కూలీల వ్యవహారం ఎట్లుందంటే ఫోటోలకు ఫోజులిచ్చి, మాస్టర్లు వేసుకొని 307/రూపాయల ప్రభుత్వ ధనాన్ని కాజేస్తున్నారు. ఇదంతా సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువు కావడంతో ఉపాధి హామీ అభాసు పాలవుతుంది. ఈ దారుణాలను చూడలేక కొందరు కలెక్టర్ కు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. కావున సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి గ్రామీణ ఉపాధి హామీ నిధుల దుర్వినియోగాకి అడ్డుకట్ట వేయాలని ఈ సందర్భంగా ప్రజలు కోరుతున్నారు.

## రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి



**దేప శ్యాంసుందర్ ముదిరాజ్**

**చౌటుప్పల్ విశాలభారతి:** భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సుక్క రవీందర్ ఆదేశాల అనుసారం చౌటుప్పల్ మండలం దండు మల్కాపూర్ గ్రామంలోని బస్టాండ్ ఆవరణలో ఉన్నటువంటి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ దేప శ్యాంసుందర్ ముదిరాజ్ మరియు చౌటుప్పల్ వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎం.డీ.గౌస్ ఖాన్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు ఈడుదుల ఇంద్రసేన యాదవ్, పక్కిర్ వంశీధర్ రెడ్డి,ఉప్పరి అనిల్ కుమార్,అత్తపురం సంతోష అంజిరెడ్డి,కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ప్రధాన కార్యదర్శి పక్కిర్ ప్రభాకర్ రెడ్డి,ఆంధోళ్ మైసమ్మ& రామలింగేశ్వర స్వామి డైరెక్టర్లు జొన్నగంటి దాసు,మన్నె మహేందర్ రెడ్డి,బొంతల యువరాజ్,సిలువేరు శంకర్,ఎల్లంకి లింగచారి,దౌడి లింగస్వామి,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈడుదుల హరిప్రసాద్,మహ్మద్ గాలీబ్ ఖాన్,ఎం.డీ.బాబా,సిలువేరు బాలయ్య,ఈడుదుల జంగయ్య,చామట్ల ప్రభాకర్,ఈడుదుల కేశవ్ యాదవ్,ఈడుదుల పరమేష్ యాదవ్,ముదిగొండ మహేష్,చందుపట్ల సాయి నేత,మహంకాళి పృథ్వి, సందగళ్ల నవీన్ గౌడ్,షేక్ అహ్మత్,రహ్మత్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం మాటలే తప్ప చేతలు లేవు

- **కడారి కల్పన ఐలయ్య యాదవ్ బిజెపి పట్టణ అధ్యక్షులు**
- **ధాన్యం కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలి**
- **దూడల బిక్షం గౌడ్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు**



**చౌటుప్పల్ విశాలభారతి:** మండలంలోని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చౌటుప్పల మార్కెట్ యార్డులలో మరియు గ్రామాలలో గల ఐకెపి సెంటర్లలను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి చౌటుప్పల్ పట్టణ అధ్యక్షులు కడారి కల్పన ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ.. రైతులు పండించిన వరి పంట కోసి 40 రోజులు కావస్తున్న ఇంతవరకు 30% తూకాలు కూడా జరగడం లేదనీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకే కానీ చేతులతో పని చూపించడం లేదనీ విమర్శించారు.రైతులను మాయమాటలు చెప్పి వారు పబ్బం గడుపుకుంటున్నారు తప్ప రైతులకు ఒరగబెట్టింది ఏమీ లేదు అని రాష్ట్ర ప్రభుత్వాన్ని దుయ్య బట్టారు. అనంతరం బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడల బిక్షం గౌడ్ మాట్లాడుతూ..మరో 15 రోజులలో వర్షాకాలం రాబోతున్న సందర్భంగా వరి ధాన్యం త్వరితగతిన కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని తెలిపారు.అనంతరం బిజెపి శ్రేణులు రైతులను ఆదుకోవాలని ఆర్డీవో కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.తూకాలలో 40 కిలోల 100 గ్రాములకు బదులు మరో 2 కేజీలు అదనంగా తూకం వేస్తున్న సందర్భంగా రైతుల పక్షాన భారతీయ జనతా పార్టీ ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రూరల్ అధ్యక్షులు కైరం కొండ అశోక్,రమణ గోని శంకరయ్య,షాగా చంద్రశేఖర్ రెడ్డి,కంది లక్ష్మారెడ్డి,ముత్యాల భూపాల్ రెడ్డి,కంచర్ల గోవర్ధన్ రెడ్డి,గుజ్జుల సురేందర్ రెడ్డి,కౌన్సిలర్లు పోలపల్లి లక్ష్మీ ముత్తయ్య,ఆలే శ్రీలత చిరంజీవి,బుడ్డ సురేష్,మునగాల తిరుపతి రెడ్డి,మునగాల అమరేందర్ రెడ్డి,చినుకని మల్లేశం,ఉడుగు వెంకటేశం గౌడ్,కడారి ఐలయ్య,యాస అశోక్ రెడ్డి,పబ్బతి శేఖర్,రాజశేఖర్,వెంకట్ రెడ్డి మరియు పార్టీ శ్రేణులు బూత్ అధ్యక్ష కార్యదర్శులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నీర్మల గ్రామంలో బడిబాటకు విశేష స్పందన




**దేవరుప్పుల విశాలభారతి:** ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఈరోజు నీర్మాల గ్రామంలోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అంగన్వాడి ఉపాధ్యాయుల సమావేశానికి మంచి స్పందన లభించింది. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా ఉప్పుగల్ల శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ, గ్రామంలోని బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాదమిక ఉన్నత పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఆయన కోరారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నదని తెలిపారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం, యూనిఫామ్, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, టై బెల్ట్ వంటి సౌకర్యాలు కూడా విద్యార్థులకు కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ రెడ్డి, కిరణ్ కుమార్, హైస్కూల్ ఉపాధ్యాయులు సజ్జన్ కుమార్, అంగన్వాడీ ఉపాధ్యాయులు రాజోలు లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

# హయత్‌నగర్ రజక బస్తీలో కలుషిత నీరు

- **ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమా..?**
- **మూడు నెలలుగా మురుగు నీరే తాగుతున్న బస్తీవాసులు.. అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**







హయత్‌నగర్ ఓల్డ్ విలేజ్‌లోని రజక బస్తీలో గత మూడు నెలలుగా కలుషిత తాగునీరు సరఫరా అవుతుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీటిని తలపించేలా దుర్వాసనతో వస్తున్న నీటిని తాగలేక, వాడలేక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నా జలమండలి అధికారులు మాత్రం కళ్లుమూసుకుని కూర్చోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇప్పటికే నక్క బస్తీలో ఇలాంటి సమస్యలపై ప్రజలు ఆందోళనలు వ్యక్తం చేసినా, అధికారుల్లో ఎలాంటి మార్పు రాకపోవడం దారుణమని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రజలకు కనీస అవసరమైన స్వచ్ఛమైన తాగునీటిని కూడా అందించలేని పరిస్థితి ఏర్పడడం ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని మండిపడుతున్నారు. బస్తీలో నీటి సరఫరా తీవ్ర లోప్రెషర్‌తో జరుగుతుండటంతో చాలా ఇళ్లకు అసలు నీళ్లు రావడం లేదని, వచ్చినా ఒకటి రెండు బిందెలతోనే రోజంతా గడపాల్సిన పరిస్థితి నెలకొందని మహిళలు వాపోతున్నారు. కొంతమంది ప్రభావశీలులు మోటార్లు పెట్టుకుని మొత్తం నీటిని గుంజేస్తుండగా, సామాన్య ప్రజలకు మాత్రం ఒక్క చుక్క నీరు కూడా అందని పరిస్థితి ఉందని ఆరోపిస్తున్నారు. గత మూడు నెలలుగా వాటర్ వర్క్స్ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, అధికారులు కార్యాలయాల్లో కూర్చొని ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని బస్తీవాసులు మండిపడుతున్నారు. డెంగీ, వైరల్ ఫీవర్లు, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నప్పటికీ అధికారులు క్షేత్రస్థాయిలోకి రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్తీ ప్రజల విజ్ఞప్తి మేరకు మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి రజక బస్తీలో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. కలుషిత నీటిని స్వయంగా పరిశీలించిన ఆయన, ప్రజల ఇబ్బందులు తెలుసుకుని అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు మురికి నీరు తాగుతూ అనారోగ్యాల బారిన పడుతున్నా జలమండలి అధికారులకు చీమకుట్టినట్టూ లేదు. బస్తీల్లో సమస్యలు పేరుకుపోతున్నా అధికారులు స్పందించకపోవడం పూర్తిగా నిర్లక్ష్య ధోరణి. పన్నులు మాత్రం కట్టించుకుంటూ, కనీస సౌకర్యాలు ఇవ్వకపోవడం దారుణం. వెంటనే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిష్కరించాలి. లేదంటే ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతాం అని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జలమండలి అధికారులు స్పందించి రజక బస్తీలో స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




**డీసీపీ కార్యాలయంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న సైబర్ క్రైమ్ డీసీపీ టి. సాయిమనోహర్**

## దొంగ ఖాతాలతో కోట్ల మోసం

- **రాపిడో బాయ్ దిలీప్ సింగ్ అరెస్ట్**
- **డీసీపీ కార్యాలయంలో వివరాలు వెల్లడించిన సైబర్ క్రైమ్ డీసీపీ సాయిమనోహర్**

**సైబరాబాద్ - విశాల భారతి**

సైబర్ మోసాలకు దొంగ ఖాతాలు సరఫరా చేస్తూ కోట్లు కొల్లగొట్టడంలో కీలకంగా వ్యవహరించిన రాపిడో డెలివరీ బాయ్ దిలీప్ సింగ్‌ను సైబరాబాద్ సైబర్ క్రైమ్, ఎస్ఓటీ పోలీసులు బుధవారం తెల్లవారుజామున సంయుక్త ఆపరేషన్‌లో అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను డీసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సైబర్ క్రైమ్ డీసీపీ టి. సాయిమనోహర్ వెల్లడించారు. రాజస్థాన్‌లోని నాగూర్ జిల్లాకు చెందిన దిలీప్ సింగ్ (27) ప్రస్తుతం జీడిమెట్ల అపూరూప కాలనీలో నివాసముంటూ రాపిడో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. నిందితుడు దిలీప్ సింగ్ నుంచి 1.02 లక్షల నగదు, 3 మొబైల్ ఫోన్లు, 12 డెబిట్ కార్డులు, 7 చెక్‌బుక్‌లు, 3 పాస్‌బుక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. 2024లో ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనల ద్వారా "జోర్డాన్", "పింటూ భయ్యా" అనే సైబర్ నేరగాళ్లతో దిలీప్ సింగ్‌కు పరిచయం ఏర్పడింది. కమిషన్ ఆశతో సేవింగ్స్ ఖాతాకు 25 వేలు, కరెంట్ ఖాతాకు 50 వేలు తీసుకుని తనతో పాటు ఇతరుల బ్యాంక్ ఖాతాలు, ఏటీఎం కార్డులు, సిమ్‌కార్డులు, పాస్‌బుక్‌లు, చెక్‌బుక్‌లను సైబర్ నేరగాళ్లకు అందించాడని డీసీపీ వెల్లడించారు.



**నిందితుల వద్ద నుంచి రికవరీ చేసిన నగదు వివిధ ఖాతాలో ఏటీఎం, క్రెడిట్ కార్డులు, సెల్ ఫోన్లు.**

ట్రేడింగ్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, ఆన్‌లైన్ గేమింగ్, పార్ట్‌టైమ్ జాబ్ మోసాలకు నిందితుడు దిలీప్ సింగ్ సరఫరా చేసిన దొంగ ఖాతాలను వాడి అమాయకుల నుంచి భారీగా డబ్బు దోచుకున్నట్లు గుర్తించామన్నారు. దిలీప్ సింగ్ 33 పాస్‌బుక్‌లను వివిధ రాష్ట్రాలకు కొరియర్ చేసినట్లు విచారణలో తేలిందని, కొందరు బ్యాంక్ ఉద్యోగులు కూడా నిందితుడితో కుమ్మక్కై ఖాతాలు తెరిచినట్లు ప్రాథమికంగా వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు. పోలీసుల హెచ్చరిక: కమిషన్ ఆశతో బ్యాంక్ ఖాతాలు, ఏటీఎం కార్డులు, ఓటీపీలు ఇతరులకు ఇవ్వొద్దని, "ఈజీ మనీ" ప్రకటనలు నమ్మొద్దని డీసీపీ సాయిమనోహర్ సూచించారు. దొంగ ఖాతాలతో సంబంధం ఉన్నట్లు తేలితే ఖాతాలు ఫ్రీజ్ అవడంతో పాటు అరెస్టు తప్పదని హెచ్చరించారు. అనుమానాస్పద లావాదేవీలపై 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు లేదా http://cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

## పేదరికం చదువుకు అడ్డురాకూడదు

- **మిరియాల ప్రీతమ్**
- **చందానగర్ ఉర్దూ స్కూల్ విద్యార్థులకు రాఘవ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం**

**శేరిలింగంపల్లి, విశాల భారతి**

శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని వెంకుంట చందానగర్ ఎంపీహెచ్ఎస్ ఉర్దూ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి పై చదువుల కోసం ముందుకు సాగుతున్న పేద విద్యార్థులకు మిరియాల రాఘవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మిరియాల ప్రీతమ్ ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు చెక్కులను అందజేసి వారిలో ఆత్మవిశ్వాసం నింపారు. ఈ సందర్భంగా మిరియాల ప్రీతమ్ మాట్లాడుతూ "పేదరికం చదువుకు అడ్డురాకూడదు. చదువే నిజమైన ఆస్తి. విద్యార్థుల ప్రగతే మా లక్ష్యం. మిరియాల రాఘవ చారిటబుల్ ట్రస్ట్ ఎల్లప్పుడూ విద్యార్థులకు అండగా నిలుస్తుంది. ఆర్థిక ఇబ్బందులతో చదువు ఆపే పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో ఈ సాయం అందిస్తున్నాం" అని తెలిపారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఫిర్దోస్ బేగం మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం మిరియాల ప్రీతమ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. "పేద విద్యార్థులకు అండగా నిలుస్తూ వారికి ప్రోత్సాహం అందించడం ఎంతో గొప్ప విషయం. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తాయి" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మహమ్మద్ గౌస్, మల్లెల జయ, పుట్టల శాంత, మీసాల కవిత, సంగీత, నాజియా బేగం, తన్వీర్ బేగం పాల్గొన్నారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులు ఫిర్దోస్ బేగం (హెచ్.ఎం - ఉర్దూ మీడియం), మహ్మద్ ఫైసల్ పాషా, షహానా బేగం, మస్రత్ టీచర్, నిఖత్ ఫాతిమా, మహ్మద్ అహ్మద్ (డిప్యుటేషన్ - సిద్ధిక్ నగర్ పాఠశాల), లక్ష్మణ్ నాయక్ (టీఎం హెచ్.ఎం) తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి నాలుగేళ్ల బాలుడు మృతి

**బాటసింగారం వద్ద విషాద ఘటన**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**



అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని బాటసింగారం గ్రామంలో చెరువులో పడి నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుందని అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు. ఇన్స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం దేవరపాలెం గ్రామానికి చెందిన వీరేపల్లి సుబ్బారావు జీవనోపాధి కోసం రెండేళ్ల క్రితం కుటుంబంతో కలిసి బాటసింగారం గ్రామంలోని ఆల్వింగ్స్ అకాడమీలో వాచ్‌మన్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఆయన కుమారుడు వీరేపల్లి నవీన్ (4) ఆడుకోవడానికి బయటకు వెళ్లాడు. అయితే కొంతసమయం గడిచినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బాలుడి కోసం గాలింపు చేపట్టారు. మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో అకాడమీకి సమీపంలో గొర్రెలు మేపుతున్న ఓ కాపరి, అకాడమీకి 300 మీటర్ల దూరంలో ఉన్న మంగళోని కుంటలో ఓ బాలుడు నీటిలో తేలుతున్నట్లు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వెంటనే అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు బాలుడిని చెరువు నుంచి బయటకు తీసి అబ్దుల్లాపూర్‌మెట్‌లోని మనోజ్ఞ ఆసుపత్రికి తరలించారు. అయితే బాలుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారని ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు.

## 90 శాతం అభివృద్ధి ఎక్కడ జరిగింది

**కూకట్పల్లి ఎమ్మెల్యేపై కాంగ్రెస్ నేత యుగంధర్ రెడ్డి ఆగ్రహం**



**కూకట్ పల్లి విశాలభారతి:** కూకట్పల్లి నియోజకవర్గంలో 90 శాతం అభివృధ్ధి జరిగిపోయిందని ఇంకా ఒక పది శాతం మాత్రమే మిగిలి ఉందని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ప్రతీ నిత్యం మైకుల్లో గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు.మరి చెరబండ రాజునగర్ శ్మశాన వాటికలో అభివృధ్ధి ఎందుకు చెందలేదని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ప్రశ్నించారు. శ్మశానవాటిక గురించి బిఆర్ఎస్ పార్టీ నాయకుడు, బాలానగర్ మాజీ కార్పొరేటర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.కేవలం ప్రజల్లో తన ఉనికిని కాపాడుకోవడానికి మాత్రమే ఎమ్మెల్యే పర్యటిస్తున్నాడని ఎద్దేవా చేశాడు. అభివృధి జరిగిపోయినాక, పర్యటనల పేరుతో అధికారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, ఇది మంచి సంప్రదాయం కాదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వ్యవహారం పట్ల అధికారులు ఇప్పటికే విసుగు చెందారని, అధికారయంత్రాంగం అంతా నివురు గప్పిన నిప్పులాగా ఎప్పుడూ ఎమ్మెల్యే మీదకు తిరగబడతారో తెలియదని, విశ్వసనీయ సమాచారం ప్రకారం త్వరలో జరుగుతుందని అన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం కోట్లాది రూపాయలతో కూకట్పల్లి నియోజకవర్గంలో అనేక అభివృధ్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు.

## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి ఘన నివాళులు

**ఎల్బీనగర్‌లో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ యువనేత జక్కిడి సత్యతేజ రెడ్డి**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఎల్బీనగర్‌లోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ యువనేత జక్కిడి సత్యతేజ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జక్కిడి సత్యతేజ రెడ్డి మాట్లాడుతూ.. దేశ ఆధునీకరణకు, సమాచార సాంకేతిక రంగ అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించి, దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపించిన దూరదృష్టి గల నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. దేశ సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాజీవ్ గాంధీ చేసిన త్యాగాలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ మరువదని అన్నారు. ఆయన ఆశయాల సాధనకే కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.

## ఘనంగా చెట్టి నవీన్ గౌడ్ జన్మదిన వేడుకలు

**శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, కాలనీ అధ్యక్షులు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** పెద్ద అంబర్‌పేట్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు చెట్టి నవీన్ గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ కాలనీల అధ్యక్షులు, యువకులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని చెట్టి నవీన్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నాయకులు చెట్టి నవీన్ గౌడ్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించి పూలమాలలు వేసి అభినందించారు. ప్రజల మధ్య ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న నాయకుడిగా ఆయన సేవలను పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారంలో చెట్టి నవీన్ గౌడ్ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజా సేవలో ముందుండాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గౌని భాస్కర్ గౌడ్ , బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బాబు గౌడ్ , ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## అమీన్‌పూర్‌లో జోనల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

**రోడ్లు, పారిశుధ్య పనులపై అధికారులకు అల్టిమేటం**

**సైబరాబాద్, విశాల భారతి:** అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని భారతీనగర్ వార్డులో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ బుధవారం ఆకస్మిక పర్యటన చేపట్టారు. బీహెచ్ఈఎల్ ప్లాంట్, మ్యాక్ సొసైటీ కాలనీ, రైతు బజార్, విద్యుత్ నగర్ ప్రాంతాల్లో రహదారులు, పారిశుధ్యం, పౌర మౌలిక వసతుల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రైతు బజార్‌లో దుకాణాల కేటాయింపు ప్రక్రియను సమీక్షించి స్థానిక వ్యాపారులు, నివాసితులతో మాట్లాడారు. వర్షాకాలంలో జలముంపు, ట్రాఫిక్, చెత్త సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేశారు. ప్రజల రోజువారీ జీవనం మెరుగుపరచడానికి రహదారుల మరమ్మతు, పారిశుధ్య సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజల సౌకర్యార్థం ఎలాంటి లోపాలనైనా సహించేది లేదు. రోడ్లు, డ్రైనేజీ, చెత్త సమస్యలను తక్షణం పరిష్కరించి నివేదిక ఇవ్వాలి" అని జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ స్పష్టం చేశారు.అమీన్‌పూర్ సర్కిల్‌లో ట్రాఫిక్, వర్షాకాల జలముంపు, పారిశుధ్యంపై స్థానికుల నుంచి తరచూ ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. జోనల్ కమిషనర్ ఆదేశాలతో అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయి. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



# అక్రమ మనుషుల రవాణా

- మనుషుల అమ్మకాలకు భద్రాచలం బస్టాండ్ అడ్డ
- బేరం కుదుర్చుకొని లక్షల్లో వ్యాపారం
- కూటికి లేనోడు కుబేరులు అవుతున్న వైనం
- కళ్ళముందే పాతకాలంనాటి బానిస వ్యవస్థ
- ఆదివాసులను టార్గెట్ చేసి అంతర్ రాష్ట్రాలకి మనుషుల సరఫరా



**భద్రాచలం, విశాలభారతి:**

ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలం పట్టణంలో అనేక ఎండ్ల నుంచి ఆదివాసి గిరిజనులను కొంతమంది పనుల పేరు మీద మనుషుల అమ్మకాలను యదేచ్ఛగా అమ్మటం జరుగుతుంది. ఈ మనుషుల అమ్మకాలకు ఆదివాసీలైన చతిస్గడ్ మధ్యప్రదేశ్ ఒడిస్సా తదితర రాష్ట్రాల నుంచి ఆదివాసులు వస్తున్న నేపథ్యంలో వారికి పని కల్పిస్తామని కొంతమంది భద్రాచలంలో ఉన్న ముఠా వారికి రెండు మూడు రోజులు అన్నం పెట్టి కొంతమంది దళారులతో బోర్ వెల్స్ కాంక్రీట్ వంటి పనులకు తరలిస్తున్నారు. వీరికి పని కల్పించినందుకు కాంట్రాక్టర్ల వద్ద పది నుంచి 20వేల వరకు ఒక్కొక్క తలకాయకి వసూలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తుంది. అమాయక ఆదివాసుల శ్రమను దోచుకుంటూ కొంతమంది కోట్లు సంపాదించిన వారు భద్రాచలం లో ఉన్నారు. ఈ అక్రమ మనుషుల రవాణాపై అధికారులు ప్రత్యేకమైన నిఘా పెట్టి మనుషుల అమ్మకాల పైన పూర్తి సమాచారం సేకరించి ఆదివాసుల అమ్మకాలను అరికట్టాలి. పనులు కల్పిస్తామని నెపంతో వారికి సరైన సదుపాయాలు అందించకుండా వారు మరణించిన కూడా అడ్రస్ లేకుండా చేసిన దాఖలాలు అనేకమైనవి చోటుచేసుకున్నాయి. భద్రాచలంలో పని కోసం వచ్చిన ఆదివాసులను టార్గెట్ చేసుకొని వారికి మాయమాటలు చెప్పి ఇతరత్రా రాష్ట్రాలకు తరలించి వారి వద్ద నుంచి కమిషన్లు వేలల్లో వసూలు చేస్తున్నారు. ఆనాటి బానిస వ్యవస్థ లో కూడా మనుషులను అమ్మి వారితో వివిధ రకాల పనులు చేయించుకునేటువంటి పరిస్థితి ఆనాటి సమాజానికి ఉంది కానీ చట్టాలు గిరిజనుల పక్షాన ఉన్న ఇది కంప్యూటర్ యుగం అయిన గాని ఏ చట్టం కూడా గిరిజనుల పక్షాన లేకపోవడం దురదృష్టకరం. ఇంత పెద్ద ఎత్తున రహస్యంగా బిజినెస్ భద్రాచలంలో జరుగుతుంది. కొంతమంది ఆదివాసులకు పని చేయించుకొని కూడా డబ్బులు ఇవ్వకుండా ఎగగొట్టిన దాఖలాలు కూడా ఉన్నాయి మోసపూరితమైన మాటలతో భద్రాచలం పట్టణంలో పెద్ద ఎత్తున మనుషుల అమ్మకాలు జరుగుతున్నాయి భద్రాచలం లో ఉన్న ఐటీడీ అధికారి దీనిపైన ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టి ఆదివాసులను అమ్ముకుంటూ పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్న కొంతమంది ముఠాను తక్షణమే అరెస్టు చేయాలి. ఇతర రాష్ట్రాల నుంచి పనుల కోసం వస్తున్న ఆదివాసులను భద్రాచలంలో ఉన్న ఐటీడీఏ అధికారి అక్కున చేర్చుకొని వారికి పని కల్పించే దాంట్లో చొరవ చూపాలి. దళారుల చేతిలో చిక్కి ఆదివాసుల జీవితాలు విచ్ఛిన్నం అవుతున్నాయి. పని కల్పిస్తున్నామని నెపంతో వారి వద్ద నుండి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసి కోట్లకు పరిగెత్తుతున్న ముఠాను అరెస్టు చేసి ఆదివాసుల జీవనశైలిని మార్చి మోసపోయే తీరును వివరించాలి. ఇతర రాష్ట్రాలకు పనులరీత్యా తోలకు వెళ్లి పశువుల కన్నా హీనంగా చూస్తున్న వారిపై సమగ్ర విచారణ చేపట్టి ఉన్నతాధికారులు చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని భద్రాచలం ప్రజలు అభ్యుదయవాదులు ప్రజాతంత్ర వాదులు కోరుతున్నారు

## మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు సన్మానం

- శుభాకాంక్షలు తెలిపిన రఘునాథ్ యాదవ్
- పూల బొకే, శాలువాతో సత్కరించిన యాదవ కార్పొరేషన్ చైర్మన్



**సైబరాబాద్ విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మిని తెలంగాణ యాదవ కార్పొరేషన్ చైర్మన్ ఎం. రఘునాథ్ యాదవ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. బుద్ధ భవన్‌లోని కమిషన్ కార్యాలయంలో ఆమెను కలిసి పూల బొకే, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రఘునాథ్ యాదవ్ మాట్లాడుతూ, జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్‌గా నగరానికి సేవలందించిన విజయలక్ష్మి ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం హర్షణీయమన్నారు. మహిళా సాధికారత కోసం యాదవ కార్పొరేషన్ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.మే 11న చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన గద్వాల విజయలక్ష్మి, రాష్ట్రంలో మహిళల భద్రత, హక్కుల పరిరక్షణే తన ప్రాధాన్యత అని తెలిపారు. మహిళలపై వేధింపులు, అన్యాయాలపై వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## శేరిలింగంపల్లి జోన్ డీసీపీని కలిసిన యాదవ కార్పొరేషన్ చైర్మన్

- సీహెచ్. శ్రీనివాస్‌కు పూల మొక్క అందజేసిన ఎం. రఘునాథ్ యాదవ్



**సైబరాబాద్ విశాల భారతి:** సైబరాబాద్ శేరిలింగంపల్లి జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సీహెచ్. శ్రీనివాస్‌ను యాదవ కార్పొరేషన్ చైర్మన్ ఎం. రఘునాథ్ యాదవ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీసీపీ కార్యాలయంలో ఆయనకు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రఘునాథ్ యాదవ్ మాట్లాడుతూ, సమాజ భద్రత కోసం పోలీస్ శాఖ చేస్తున్న అంకితభావ సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. శేరిలింగంపల్లి జోన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై డీసీపీతో చర్చించినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్న పోలీస్ శాఖకు యాదవ కార్పొరేషన్ తరఫున సహకారం అందిస్తామన్నారు.

## సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ర్యాలీ



**సికింద్రాబాద్, విశాలభారతి :** గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ పిలుపుమేరకు సీతాఫల్మండి సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సీతాఫల్మండి జోన్ ఆధ్వర్యంలో సెంట్రింగ్ బంద్ కు పిలుపునివ్వడం జరిగినది.బంద్ సందర్భంగా గురువారం సెంట్రింగ్ కాంట్రాక్టర్ల బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఉపాధ్యక్షులు కనకట్ల హరి విచ్చేసి మద్దతు పలకడం జరిగినది. ఈ కార్యక్రమంలో సీతాఫల్మండి జోన్ అధ్యక్షులు అంబాల రాజేశ్వరరావు అధ్యక్షతన ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి నర్సింగరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, యాదగిరి, వెంకటేష్, హుస్సేన్, సుబ్బారావు, సిద్దయ్య, లింగం, లక్ష్మణ్, చందు, సత్యనారాయణ, కనకయ్య, కమిటీ సభ్యులు అందరూ పాల్గొనడం జరిగినది.

## దూరదృష్టి కలిగిన నాయకుడు రాజీవ్ గాంధీ

**సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్**



**విశాలభారతి కరకాగూడెం :** మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ గారీ వర్ధంతి సందర్భంగా పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు కరకగూడెం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోనీ అంబేద్కర్ రాజీవ్ సెంటర్ నందు రాజీవ్ గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారతదేశాన్ని అనేక రంగాల్లో అభివృద్ధి చేసిన ధృవతార ఐటి రంగానికి పునాదులు వేసిన మార్గదర్శి, నిరుపేదలకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడు యువతకు 18 ఏళ్ళకే ఓటు హక్కును కల్పిస్తూ యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొనేలా చేసిన సంస్కరణ కర్త రాజీవ్ గాంధీ గారు అని అన్నారు.భారత దేశ సాంకేతిక అభివృద్ధి ఆద్యుడు, పరిపాలనలో సంస్కరణలు తెచ్చిన నాయకులు, దేశ సౌభ్రాతృత్వం కాపాడటం కోసం తన ప్రాణాన్ని త్యాగం చేసిన మహనీయులు, నవ భారత నిర్మాత, భారతరత్న దివంగత ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికిన పాలనాధ్యక్షులు, భారత రత్న, మాజీ ప్రధాని శ్రీ. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘనంగా నివాళులు అర్పిస్తూ రాజీవ్ గాంధీ ప్రతి పేద వాడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగ బండి వెంకటేశ్వర్లు , జిల్లా కార్యదర్శి ఎర్ర సురేష్ గౌడ్, ఉప సర్పంచ్ లు పూజారి వెంకన్న , గాందర్ల రామనాథం ,మండల నాయకులు షేక్ రఫీ ,వట్టం చుక్కయ్య , కటకం నరసింహారావు , దుర్గం కన్నయ్య , మేడి శ్రీను గారు, రాంబాబు , సాంబయ్య , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## రాజీవ్ గాంధీ అందించిన సేవలు చిరస్మరణీయం



**ఎమ్మెల్యే జారె**

**అశ్వారావుపేట, విశాలభారతి:** గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఈరోజు భారతదేశ మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ దేశాన్ని ఆధునిక సాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్లడంలో రాజీవ్ గాంధీ గారి పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. కంప్యూటర్ మరియు టెలికాం రంగాల అభివృద్ధికి పునాది వేసి భారతదేశాన్ని సాంకేతిక విప్లవ దిశగా నడిపించిన దూరదృష్టి గల నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. గ్రామీణ భారత అభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, యువతకు అవకాశాల కల్పన, సమాచార సాంకేతిక రంగానికి బలమైన పునాది వేయడంలో ఆయన విశేష కృషి చేశారని తెలిపారు. దేశ సమైక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆయన చేసిన సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు.

## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం :జూపల్లి

**అశ్వారావుపేట, విశాలభారతి: మాజీ ప్రధాన మంత్రి**

రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశ యువతకు సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేసి భారతదేశాన్ని ఆధునిక దిశగా నడిపించిన దూరదృష్టి గల నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. సమాచార సాంకేతిక రంగానికి పునాది వేసి, కంప్యూటర్ మరియు టెలికాం రంగాల అభివృద్ధికి విశేష కృషి చేసిన మహానేతగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, యువతకు అవకాశాల కల్పనలో రాజీవ్ గాంధీ చేసిన సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు.అలాగే దేశ సమైక్యత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఆయన చేసిన త్యాగం ప్రతి భారతీయుడికి ఆదర్శమని పేర్కొన్నారు. యువ నాయకత్వానికి ప్రతీకగా నిలిచిన రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిన్నాశెట్టి సత్యనారాయణ, మండల కాంగ్రెస్ నాయకులు తుమ్మ రాంబాబు,నంద్రు రమేష్, తాడేపల్లి రవి, సూరపనేని ఫణి, కౌన్సిలర్ మిండా హరిబాబు,ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జల్లిపల్లి దేవరాజు , గుమ్మల్ల గోపి, మందపాటి వెంకన్నబాబు,శ్రీను, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి గురించి స్థానిక ఎమ్మార్వోని కలిసిన జేఏసీ నేతలు



**విశాలభారతి :** కరకగూడెం మండలం, సమత్ భట్టుపల్లి రెవిన్యూ గ్రామం సమత్ భట్టుపల్లి గ్రామపంచాయతీ ప్రధాన రహదారికి ప్రక్కనటువంటి ప్రభుత్వ భూమిని కొంతమంది గిరిజనేతరులు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఆక్రమించారు ఆ విషయం తెలుసుకున్న జేఏసీ నేతలు హుటాహుటిన సమత్ భట్టుపల్లి లోని ప్రధాన రహదారి పక్కన ఉన్నటువంటి ఆక్రమిత స్థలానికి వెళ్లి పరిశీలించారు. తర్వాత స్థానిక ఎమ్మార్వో ని కలిసి వినతి పత్రం అందజేశారు. అక్రమంగా ఆక్రమించినటువంటి ప్రభుత్వ భూమిని వెంటనే ప్రభుత్వాదినంలోకి తీసుకోవాలని కోరారు ఆక్రమించినటువంటి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ మండల అధ్యక్షులు గోగ్గలి కృష్ణ , జేఏసీ మండల కన్వీనర్ సోలం రామారావు , ఉపాధ్యక్షులు పోలేబోయిన భూషణం , వర్కింగ్ ప్రెసిడెంట్ సేలం రామకృష్ణ , ప్రధాన కార్యదర్శి పోలేబోయిన ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతీ పుష్కరాలతో ఆధ్యాత్మిక శోభ



**మన సంస్కృతి, నదీ జీవన విధానం ప్రపంచానికే ఆదర్శం – ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

పవిత్రమైన సరస్వతీ నది అంత్య పుష్కరాల ప్రారంభోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు , కొండా సురేఖ లతో కలిసి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయంద్ర సరస్వతి స్వామి వేదమంత్రోచ్చారణల నడుమ పుష్కరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలు, నదీ జీవన విధానం ప్రపంచానికే ఆదర్శం. పవిత్ర నదీ పుష్కరాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయి అని పేర్కొన్నారు. సరస్వతీ దేవి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షించారు.

**జ్ఞానానికి ప్రతీక సరస్వతీ అమ్మవారు**

భారతీయ సంస్కృతిలో సరస్వతీ నదికి విశిష్ట స్థానం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. జ్ఞానానికి, విద్యకు అధిదేవత అయిన సరస్వతీ అమ్మవారి



అంత్య పుష్కరాల ప్రారంభ దినాన నదిని దర్శించుకోవడం, పూజలు నిర్వహించడం ఎంతో పుణ్య ఫలమని అన్నారు. ఈ పవిత్ర రోజుల్లో నదీ స్నానం ఆచరించడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు పుణ్యగతులు సిద్ధిస్తాయని ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని వివరించారు.

**శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు**

పుష్కరాల ప్రారంభాన్ని పురస్కరించుకుని నదీ తీరాన ఉన్న శ్రీ కాళేశ్వరం ముకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల వేదమంత్రోచ్చారణల నడుమ నదికి అర్ఘ్యప్రదానం చేసి హారతులు సమర్పించారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

**ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలి**

రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి జీవితాల్లో చదువుల తల్లి జ్ఞానజ్యోతులు నింపాలి. రైతాంగం చల్లగా ఉండాలి.

## గుండాల గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

- 65 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలు, 1 బొలెరో స్వాధీనం
- పదిహేను వేల విలువచేసే కలప, కలప కటింగ్ యంత్రం స్వాధీనం
- అసాంఘిక కార్యకలాపాలు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవు
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

**ఆదిలాబాద్ , విశాలభారతి:**

ప్రజల రక్షణ, సంరక్షణ సక్రమంగా నిర్వహించడానికి కమ్యూనిటీ కాంటాక్ట్ లను నిర్వహించడం జరుగుతుందని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. ఇచ్చోడ మండలం లోని గుండాల గ్రామం నందు ఉదయం ఐదు గంటల నుండి 8 గంటల వరకు 100 మంది సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సరైన ధ్రువ పత్రాలు లేనటువంటి 65 ద్విచక్ర వాహనాలు, 5 ఆటో లను, ఒక బొలెరో ను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. అక్రమంగా కలప విక్రయించేందుకు ప్రయత్నించిన ఇద్దరిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుండి 15 వేల విలువ చేసే కలప ను స్వాధీనం చేసుకోవడం జరిగిందని, అదే విధంగా కటింగ్ యంత్రాన్ని సైతం స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజలతో మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా, దొంగతనాలు, దోపిడీలు చేయకుండా, సత్ప్రవర్తనతో మెదలాలను తెలిపారు. గొడవలకు దారి తీసేలా ప్రవర్తించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులతో జీవించాలని సూచించారు. ఇదివరకే కేసులలో నమోదైన వారిపై సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేయడం జరుగుతుందని, ఇంతకీ మారని పక్షంలో చివరగా పీడీ యాక్ట్ సైతం నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. గ్రామ ప్రజలు నేరాలు చేసే వారి సమాచారం పోలీసులకు అందజేయాలని తెలిపారు. విద్యార్థులకు చిన్నప్పటినుండి చదువుపై ఆసక్తి పెంచేలా తల్లిదండ్రులు కృషి చేయాలని, అసాంఘిక కార్యకలాపాలు చేయకుండా పర్యవేక్షించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపకుండా ఉండాలని, ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సక్రమంగా వాహనాలను నడుపుతూ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పి రుత్వీక్ సాయి కొట్టే, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి పోతారం శ్రీనివాస్, సిఐలు సిహెచ్ రమేష్, నరేష్, సైలు, పద్మ, రిజర్వ్ ఇన్స్పెక్టర్ వెంకటి, ఎస్సైలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## వృద్ధ మహిళ మెడలోని నాలుగు తులాల బంగారం

**లాక్కెళ్లిన దుండగుడు.. అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి చోరీ – కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ పాత గ్రామంలో వృద్ధ దంపతుల ఇంట్లోకి అర్ధరాత్రి చొరబడ్డ ఓ గుర్తుతెలియని దుండగుడు వృద్ధ మహిళ మెడలోని నాలుగు తులాల బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లిన ఘటన చోటుచేసుకుందని అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు. ఇన్స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామం, మండలానికి చెందిన బొడిగె సంతోష్ (47) పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన తల్లిదండ్రులు బొడిగె దర్శన్ (80), భార్య భారతమ్మ (73) అబ్దుల్లాపూర్‌మెట్ పాత గ్రామంలోని తమ నివాసంలో నిద్రిస్తున్న సమయంలో గురువారం తెల్లవారుజామున సుమారు 2:44 గంటలకు ఓ గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించాడు. అనంతరం భారతమ్మను బెదిరించి ఆమె మెడలో ఉన్న సుమారు నాలుగు తులాల బంగారు పుస్తెల తాడును బలవంతంగా లాక్కొని అక్కడి నుంచి పరారైనట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు.

## మల్కాజిగిరి కమిషనరేట్‌లో "MEESURAKSHA" కార్యక్రమం

**ఇంటి పనివారు, సెక్యూరిటీ గార్డుల వివరాలు నమోదు చేయాలని పోలీసుల విజ్ఞప్తి**




**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో సీపీ సుమతి ఆధ్వర్యంలో "MEE SURAKSHA" అనే ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు హయత్‌నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం కాలనీలు, అపార్ట్‌మెంట్లు, కార్యాలయాలు తదితర ప్రాంతాల్లో పనిచేస్తున్న పనిమనుషులు, సెక్యూరిటీ గార్డులు మరియు ఇతర సిబ్బంది వివరాలను పోలీసుల వద్ద నమోదు చేయడం అని ఆయన పేర్కొన్నారు. ఇలా వారి పూర్తి వివరాలు పోలీసుల వద్ద అందుబాటులో ఉంటే కమిషనరేట్ పరిధిలోని కాలనీలు మరింత సురక్షితంగా ఉండటంతో పాటు, ఏదైనా నేర ఘటన జరిగిన సందర్భంలో నిందితులను త్వరితగతిన గుర్తించి పట్టుకోవడానికి ఉపయోగపడుతుందని వివరించారు. కావున హయత్‌నగర్ పట్టణ ప్రజలు, కాలనీ అధ్యక్షులు, అపార్ట్‌మెంట్ నిర్వాహకులు సంబంధిత QR స్కానర్ ద్వారా లేదా పోలీసులను సంప్రదించి పనివారి వివరాలను నమోదు చేయాలని హయత్‌నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ కోరారు. సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ 8712662640, అడ్మిన్ ఎస్ఐ నర్సింహా 8712662284, సీఐ నాగరాజ్ గౌడ్ 8712662301, క్రైమ్ సీఐ సంతోష్ 8712662282 కు తెలుపగలరు.

## రాజీవ్ గాంధీ ఆశయ సాధనే కాంగ్రెస్ లక్ష్యం

**గాంధీభవన్‌లో ఘనంగా మాజీ ప్రధానికి నివాళులు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హైదరాబాద్‌లోని గాంధీ భవన్ లో కాంగ్రెస్ పార్టీ భారతదేశ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవ రాజు శ్రీనివాస్ పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో సమాచార సాంకేతిక విప్లవానికి నాంది పలికిన మహానేత రాజీవ్ గాంధీ అని కొనియాడారు. యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించి, భారతదేశాన్ని ఆధునిక దిశగా నడిపించిన దూరదృష్టిగల నాయకుడు రాజీవ్ గాంధీ అని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, మహిళలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడంలో ఆయన పాత్ర కీలకమని తెలిపారు. దేశ సమగ్రత, లౌకికవాద పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకే కట్టుబడి ఉంటుందని అన్నారు. నేటి రాజకీయాల్లో ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవసరం ఉందని, కాంగ్రెస్ పార్టీ ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విజయాన్ని శాసించేది
# ఆ మూడు మాత్రమే

నెపోటిజం గురించి చాలామంది స్టార్‌కిడ్స్ చాలా సందర్భాల్లో మాట్లాడారు. తాజాగా మహేశ్ మంజ్రేకర్ ముద్దుల తనయ సాయి మంజ్రేకర్ కూడా ఈ అంశంపై తనదైన శైలిలో స్పందించారు. సినీ పరిశ్రమలో నటవారసత్వం అనే అంశంపై ఇటీవల ఆమె మాట్లాడుతూ 'ఇంటిపేరనేది బలమైన కెరీర్‌కి గ్యారెంటీ కార్డు కాదు. అది కేవలం ప్రారంభంలో పరిచయాలకూ, తొలి సినిమా అవకాశానికి మాత్రమే సహాయపడుతుంది. జనానికి కనెక్ట్ కానప్పుడు, ఎంతటి సూపర్‌స్టార్ వారసులైనా తలదించుకొని వెనక్కెళ్లిపోవాల్సిందే. అందుకే 'మంజ్రేకర్' అనే కంఫర్ట్ జోన్ నుంచి పూర్తిగా బయటకు వచ్చి, కేవలం నా కష్టం, అంకితభావంతో ఇండస్ట్రీలో నిలబడాలనుకుంటున్నా. హార్డ్‌వర్క్, క్రమశిక్షణ, పట్టుదల.. ఈ మూడు మాత్రమే విజయాన్ని శాసిస్తాయి' అని సాయి మంజ్రేకర్ పేర్కొన్నది. 'మేజర్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన సాయి మంజ్రేకర్.. ప్రస్తుతం తెలుగు చారిత్రాత్మక పాన్ఇండియా చిత్రం 'ఇండియా హౌస్'లో కథానాయికగా నటిస్తున్నది.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.